MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 326 | పేజీలు : 8 | ఆదివారం 15 నవంబర్ 2026 | వెల : 6-00



ఢిల్లీలో కాలుష్యం 400 దాటింది

- మోదీ నినాదంపై కాంగ్రెస్ సెటైర్లు!
- 'అబ్ కీ బార్ 400 పార్' ఇప్పుడు ఏక్యూఐ విషయంలో నిజమైంది
- ప్రధాని నినాదాన్ని ఉటంకిస్తూ జైరాం రమేశ్ వ్యంగ్యాస్త్రాలు
- ఢిల్లీ గాలిలో పెరుగుతున్న విషతుల్య కణాలు
- పిల్లలు, వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలపై ఆందోళన

5




అయ్యప్ప భక్తులకు భారీ ఊరట

- కేవలం 30 రోజుల్లో శబరిమల రోడ్డుకు కొత్త రూపు
- శబరిమల వెళ్లే చలక్కాయం-పంబ రహదారి నిర్మాణం పూర్తి
- రూ. 15 కోట్ల వ్యయంతో 12 మీటర్ల వెడల్పుగా విస్తరణ
- 9 నెలల ప్రాజెక్టును 30 రోజుల్లోనే పూర్తి చేసిన పీడబ్ల్యూడీ

ఇదే జోరు కొనసాగాలి

గ్రామస్థాయి ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు

- ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్.. ఏ విధానమైనా కూటమిదే హవా
- పల్లెల్లోనూ కూటమి జెండా ఎగరాలి
- పార్టీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- గతంతో పోల్చితే 25 శాతం పెరిగిన ఓటు బ్యాంకు
- 30 ఏళ్ల భవిష్యత్తు కోసం నాయకత్వ నిర్మాణం



అమరావతి, మహానగర్

గ్రామస్థాయి ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్యనేతలకు స్పష్టం చేశారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ ఎన్నికల్లో కూటమికి లభించిన విజయంతోనే సరిపెట్టుకోకుండా గ్రామ పంచాయతీల్లోనూ అదే ప్రభంజనాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన స్థానిక ఎన్నికల ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లు.. ఏ విధానంలో ఎన్నికలు జరిగినా ప్రజల మద్దతు కూటమికే ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి మంచి విజయాన్ని అందించారని చంద్రబాబు - మిగతా2లో

ఉత్తరాంధ్రకు మరోసారి తుపాను ముప్పు!

- బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం..
- 18, 19 తేదీల్లో భారీ వర్ష సూచన
- 16న తుపానుగా మారే అవకాశం..
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి..

2


చంద్రబాబు మరో క్రెడిట్ చోరీ

- చంద్రబాబు మరోసారి ఘనతను తన ఖాతాలో వేసుకుంటున్నారు: వైఎస్ జగన్ విమర్శ
- ఏపీకి మూడో ర్యాంకు రావడం తమ ప్రభుత్వ హయాంలో సాధించిన పురోగతేనని వెల్లడి
- 2021లో పదో స్థానం.. 2024 నాటికి మూడో స్థానానికి చేరుకున్న రాష్ట్రం
- ఆరోగ్యం, సామాజిక భద్రత, న్యాయ వనరుల సూచీల్లోనూ మెరుగైన ర్యాంకులు
- ఆధారాలతో సహా సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించిన మాజీ సీఎం



అమరావతి, మహానగర్

చంద్రబాబు మరోసారి క్రెడిట్ చోరీకి పాల్పడటంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏఈఐ ర్యాంకింగ్స్‌ను చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వైఎస్ జగన్ ఆధారాలతో పాటు ట్వీట్ చేశారు. ఏఈఐ ర్యాంకింగ్స్‌లో ఏపీకి మూడో స్థానం రావటం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతేనని వైఎస్ జగన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కానీ, దీన్ని కూడా తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మరోసారి చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన ఘనతలను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయటం సిగ్గుచేటని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. "2021--24 మధ్యకాలంలో ఏపీ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించింది. ఓపీ జిందాల్ గ్లోబల్ - మిగతా2లో



విలక్షణ నటుడికి కన్నీటి వీడ్కోలు!

ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానానికి తెర.. సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

- 600కు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర
- విలన్‌గా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రత్యేక గుర్తింపు
- దర్శకుడిగా, నిర్మాతగానూ తనదైన ముద్ర

హైదరాబాద్/అమరావతి, మహానగర్

తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ఐదు దశాబ్దాలకు పైగా తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 14న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో - మిగతా2లో

తొలిరోజు మందకొడిగా నామినేషన్లు

- కొన్ని చోట్లే అభ్యర్థుల సందడి!
- నాలుగు నగరపాలక సంస్థలు సహా 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- నరసరావుపేటలో పోలీసు భద్రత మధ్య నామినేషన్లు
- మంగళగిరి--తాడేపల్లిలో తొలి రోజే 25 నామపత్రాలు

2

నామినేషన్ల వేళ ప్రత్యేక ఎస్కార్ట్..

అభ్యర్థులకు భద్రత కల్పిస్తాం!

దాడి ముప్పు ఉంటే ఎస్పీని సంప్రదించండి: ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా

- సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ఎన్నికల కమిషన్ సమీక్ష..
- నామినేషన్ల సమయంలో ముప్పు ఉంటే ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు



తిరుపతి/అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఎవరైనా అభ్యర్థికి దాడి ముప్పు ఉందని భావిస్తే సంబంధిత జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్ కల్పిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ఎస్ఈసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇటీవల పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో సమస్యాత్మక జిల్లాలపై ప్రత్యేకంగా చర్చించారు. సమస్యాత్మకంగా గుర్తించిన 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా - మిగతా2లో

తొలిరోజు మందకొడిగా నామినేషన్లు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వివిధ కారణాలతో ఎన్నికలు, పోలింగ్ జరగకుండా నిలిచిపోయిన 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. శ్రీకాకుళం, కాకినాడ, మంగళగిరి--తాడేపల్లి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలతో పాటు 19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ మొదలైంది. అయితే తొలిరోజు చాలా ప్రాంతాల్లో అభ్యర్థుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రధాన పార్టీల అభ్యర్థులు కొన్నిచోట్ల మాత్రమే నామినేషన్లు దాఖలు చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులే ముందుకొచ్చారు.

నరసరావుపేటలో పోలీసు భద్రత

పల్నాడు జిల్లా నరసరావుపేటలో 48 వార్డులకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. తొలుత తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం పలువురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోలీసు భద్రత మధ్య నామపత్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన నివాసం వద్ద 15 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పోలీసు వాహనంలో నామినేషన్ కేంద్రాలకు పంపించారు. వారు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి చేరుకుని నామినేషన్లు దాఖలు చేశారు.

కొన్ని చోట్ల ఆసక్తికర పరిణామాలు

కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీలో 48 వార్డులకు ఎన్నికలు జరగనుండగా, తొలిరోజు ఐదో వార్డు నుంచి కూటమి అభ్యర్థి చనుమోలు వరలక్ష్మి నామినేషన్ వేశారు. గుడివాడలో 48 వార్డులకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను కలెక్టర్ బాలాజీ పరిశీలించారు. మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం తొలిరోజే కొంత సందడి కనిపించింది. టీడీపీ నుంచి నలుగురు, వైఎస్సార్‌సీపీ నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులు 10 మంది కలిపి మొత్తం 25 నామినేషన్లు దాఖలు చేశారు.

భీమవరం, తణుకులో మందకొడి

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పురపాలక సంఘంలో తొలిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థుల హడావుడి కనిపించలేదు. కాంగ్రెస్ పార్టీ తరపున కొందరు, స్వతంత్ర అభ్యర్థులు మరికొందరు మాత్రమే నామినేషన్లు సమర్పించారు. తణుకు మున్సిపాలిటీలోనూ నామినేషన్ల ప్రక్రియ నెమ్మదిగా సాగింది. 8, 42వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ తరపున రెండేసి నామినేషన్లు, 9, 26, 29వ వార్డుల్లో ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయి. 38వ వార్డులో సీపీఎం అభ్యర్థి నామపత్రం సమర్పించారు. మొత్తం 44 వార్డులున్న తణుకులో తొలిరోజు కూటమి నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. చైర్‌పర్సన్ అభ్యర్థిగా కూడా ఎవరూ నామినేషన్ వేయలేదు.

శ్రీకాళహస్తిలో 16 నామినేషన్లు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో తొలిరోజు మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో టీడీపీ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, వైఎస్సార్‌సీపీ నుంచి ఏడుగురు నామపత్రాలు సమర్పించారు. సీపీఎం తరపున ఛైర్మన్ అభ్యర్థిగా ఒకరు నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల ప్రక్రియపై ఆసక్తి

23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ పార్టీల కదలికలు పెరుగుతున్నాయి. తొలిరోజు నామినేషన్లు మందకొడిగా సాగినప్పటికీ, రానున్న రోజుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామపత్రాలు దాఖలు చేసే అవకాశం ఉంది. నామినేషన్ల చివరి తేదీ సమీపించే కొద్దీ రాజకీయ వేడి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

విలక్షణ నటుడికి కన్నీటి వీడ్కోలు!

-మొదటిపేజీ తరువాయి



తెలుగు చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తున్నారు.

600కు పైగా సినిమాల్లో నటన

గిరిబాబు అసలు పేరు యర్రా శేషగిరిరావు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే సినిమాలపై ఆయనకు అమితమైన ఆసక్తి ఉండేది. గ్రామంలో ప్రదర్శించే సినిమాలను ఆసక్తిగా వీక్షిస్తూ నటనపై మక్కువ పెంచుకున్నారు. తొలుత రంగస్థల నాటకాల ద్వారా నటనకు శ్రీకారం చుట్టారు. అనంతరం సినిమా రంగంలోకి అడుగుపెట్టి ఎన్నో ఒడిదుడుకులను అధిగమించారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'కురుక్షేత్రం', 'దేవతలారా దీవించండి', 'మా దైవం' తదితర చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ప్రతినాయకుడి పాత్రల్లో తనదైన హావభావాలు, గంభీరమైన స్వరం, ప్రత్యేకమైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ప్రతి పాత్రలోనూ వైవిధ్యం

గిరిబాబు తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో విలన్ పాత్రలకే పరిమితం కాకుండా హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, తండ్రి, పెద్దమనిషి పాత్రల్లోనూ మెప్పించారు. 'అల్లుడా మజాకా', 'సిసింద్రి', 'నువ్వే కావాలి', 'అతడు', 'కితకితలు', 'ఎవడైతే నాకేంటి', 'గమ్యం', 'అ ఆ', 'గీత గోవిందం', 'ప్రతినిధి' తదితర చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ నుంచి నేటితరం కథానాయకుల వరకు పలువురితో కలిసి నటించారు. సుమారు 600కు పైగా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఏ పాత్ర ఇచ్చినా అందులో ఒదిగిపోయే నటుడిగా పేరు తెచ్చుకున్నారు.

దర్శకుడిగా, నిర్మాతగానూ రాణింపు

నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా గిరిబాబు తన ప్రతిభను చాటుకున్నారు. జయభేరి పిక్చర్స్ నిర్మాణ సంస్థ ద్వారా పలు చిత్రాలను నిర్మించారు. 'సింహగర్జన', 'మెరుపుదాడి' వంటి చిత్రాలతో నిర్మాతగా గుర్తింపు పొందారు. 'రణరంగం', 'ఇంద్రజిత్', 'నీ సుఖమే నే కోరుతున్నా' వంటి సినిమాలకు దర్శకత్వం వహించి తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు.

చివరి చిత్రం 'అన్ని మంచి శకునములే'

దాదాపు ఐదు దశాబ్దాల పాటు సినీ ప్రేక్షకులను అలరించిన గిరిబాబు చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్ని మంచి శకునములే' చిత్రంలో కనిపించారు. నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. వయసు మీద పడుతున్నప్పటికీ సినిమాలపై ఆసక్తిని కొనసాగించారు.

రఘుబాబు తండ్రిగా ప్రత్యేక గుర్తింపు

గిరిబాబు కుటుంబం కూడా సినీ రంగంతో అనుబంధం కలిగి ఉంది. ఆయన సతీమణి శ్రీదేవి గతంలోనే అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు రఘుబాబు, బోసుబాబు ఉన్నారు. పెద్ద కుమారుడు రఘుబాబు ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఎన్నో చిత్రాల్లో నటిస్తున్నారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు

గిరిబాబు మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం ఆయన అంత్యక్రియలను ప్రకాశం జిల్లా రావినూతల స్వగ్రామంలో నవంబర్ 15న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఐదు దశాబ్దాల పాటు తెలుగు సినీ ప్రేక్షకులను తన నటనతో అలరించిన గిరిబాబు ఇక లేరన్న వార్త అభిమానులను కలచివేస్తోంది. విలక్షణ నటుడిగా ఆయన పోషించిన పాత్రలు, అందించిన సినీ సేవలు ప్రేక్షకుల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

చంద్రబాబు మరో క్రెడిట్ చోరీ

-మొదటిపేజీ తరువాయి

యూనివర్సిటీ, సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ (జేసీజీయూ) సంయుక్తంగా రూపొందించిన యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్ (యూఎక్స్) నివేదికలో ఏపీకి కీలక గుర్తింపు లభించింది. 2021లో ఏఈఐ సమగ్ర ర్యాంకింగ్స్‌లో పదో స్థానంలో ఉన్న ఏపీ.. 2024 నాటికి మూడో స్థానానికి చేరుకుంది.

ఈ పురోగతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనిదే.

దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ పదో స్థానం నుంచి మూడో స్థానానికి ఎదిగి అతిపెద్ద పురోగతి సాధించిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. 2021 ఏఈఐ నివేదికలో ఆరోగ్య సూచీలో ఏపీకి 8వ స్థానం లభించింది. 2024 నివేదికలో రాష్ట్రం రెండో స్థానానికి ఎగబాకింది. ఈ పురోగతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించినదే. 2021లో సామాజిక, ఆర్థిక భద్రతా సూచీలో ఏపీకి 11వ స్థానం. 2024 నాటికి దేశంలోనే మొదటి స్థానానికి చేరుకుంది ఏపీ. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు.. కష్టకాలంలోనూ ప్రజల కొనుగోలు శక్తికి భరోసా కల్పించాం. పరిశ్రమలు, తయారీ రంగాలకు ప్రోత్సాహం ఇచ్చాం. దక్షిణ భారతదేశంలోనే వేగవంతమైన వృద్ధి జరిగింది. ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత పెరగడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలే కారణం. 2021లో లీగల్ రికార్స్ సూచీలో ఏపీకి 15వ స్థానం. 2024 నివేదికలో రెండో స్థానానికి చేరుకుంది రాష్ట్రం. అన్ని కీలక సామాజిక, మానవ అభివృద్ధి సూచీల్లోనూ ఏపీ గణనీయమైన పురోగతి సాధించింది. ఏపీ అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కృషిని చంద్రబాబు తన ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. మా పాలనలో సాధించిన విజయాలను కప్పిపుచ్చి. రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందంటూ తప్పుడు ప్రచారం చేశారు. 2019--24 మధ్య సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం వల్లే రాష్ట్రం సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందడుగు వేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన ఫలితాలకు ఏఈఐ నివేదికే నిదర్శనం" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్రకు మరోసారి తుపాను ముప్పు!



విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి మరోసారి తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతూ వాయుగుండంగా, అనంతరం తుపానుగా మారే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. ఈ నెల 16వ తేదీ నాటికి తుపానుగా మారే అవకాశం ఉండటంతో ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో అప్రమత్తత అవసరమని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. దీని ప్రభావంతో 18, 19 తేదీల్లో ఉత్తరాంధ్రతో పాటు కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే వరుస తుపాన్ల ప్రభావంతో నష్టపోయిన తీర ప్రాంత ప్రజల్లో తాజా వాతావరణ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అల్పపీడనం నుంచి తుపానుగా..

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడనుంది. నవంబర్ 15 నాటికి తీవ్ర అల్పపీడనంగా, ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. నవంబర్ 16 సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని తాజా వాతావరణ నివేదికలు సూచిస్తున్నాయి. అయితే తుపాను తీవ్రత, తదుపరి కదలికలు, తీరం దాటే ప్రాంతంపై వాతావరణ నమూనాల్లో ఇంకా భిన్నమైన అంచనాలున్నాయి. కాబట్టి తుపాను తీరం దాటే ప్రాంతాన్ని ఇప్పుడే నిర్ధారించలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

18, 19 తేదీల్లో భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో ఈ నెల 18 నుంచి కోస్తాంధ్రలో వర్షాలు పెరిగే అవకాశముంది. ఉత్తర కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ముఖ్యంగా 19వ తేదీన వర్ష తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తోంది. సముద్రం నుంచి తేమతో కూడిన గాలులు రావడం, తుపాను కదలికల కారణంగా తీర ప్రాంతాల్లో వర్షాలు విస్తరించే అవకాశం ఉంది. ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన ప్రాంతాల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాలు, నదులు, వాగుల పరిసరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు

ఈ నెల 16 నుంచి సముద్ర తీర ప్రాంతాల్లో గాలుల వేగం పెరిగే అవకాశం ఉంది. బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, అప్పుడప్పుడు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో పాటు అలల ఉద్ధృతి పెరిగే ప్రమాదం ఉంది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, సముద్ర ప్రయాణాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మత్స్యకారులకు కీలక హెచ్చరిక

తుపాను ప్రభావం నేపథ్యంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. నవంబర్ 15 నుంచి బంగాళాఖాతంలోని నిర్దేశిత ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ముఖ్యంగా ఆగ్నేయ బంగాళాఖాతం, నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలో సముద్ర పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు, వాటిలోని సిబ్బంది సురక్షితంగా తీరానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల సూచన నేపథ్యంలో రైతులు పంటల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి. ధాన్యం, ఎరువులు, విత్తనాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వర్షపు నీరు నిలిచే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు, చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదు.

తుపాను గమనం, తీవ్రతపై కొనసాగుతున్న పరిశీలన

ప్రస్తుతం తుపాను దిశ, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై వాతావరణ నమూనాల్లో భిన్నమైన అంచనాలు ఉన్నాయి. ఉత్తరాంధ్ర తీరం వైపు కదిలే అవకాశాన్ని కొన్ని నమూనాలు సూచిస్తున్నప్పటికీ, మరో కొన్ని నమూనాలు భిన్నమైన మార్గాన్ని చూపుతున్నాయి. అందువల్ల తుపాను తీరం దాటే ప్రాంతం, దాని ప్రభావం ఎంత మేర ఉంటుందన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. వాతావరణ శాఖ విడుదల చేసే తాజా బులెటిన్ల ఆధారంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తంగా.. వరుస తుపాన్ల ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఉత్తరాంధ్రకు మరో వాతావరణ ముప్పు ఎదురవుతోంది. ముఖ్యంగా ఈ నెల 18, 19 తేదీల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశముండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఇదే జోరు కొనసాగాలి

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. అదేవిధంగా 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500కు పైగా ఎంపీటీసీ స్థానాల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని వివరించారు. ఈ ఫలితాలు ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పనిచేయాలని నేతలకు సూచించారు.

25 శాతం పెరిగిన ఓటు బ్యాంకు

గత ఎన్నికలతో పోలిస్తే కూటమి ఓటు బ్యాంకు 25 శాతం పెరిగిందని చంద్రబాబు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఉద్యోగులు సైతం ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించడం లేదని విమర్శించారు. సుమారు ఏడు జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసిందని, అనకాపల్లి, మార్కాపురం జిల్లాల్లో పూర్తి స్థాయి విజయాలు సాధించడం ప్రత్యేకమని వివరించారు.

30 ఏళ్ల భవిష్యత్తుకు నాయకత్వం తయారు చేయాలి

గ్రామస్థాయి ఎన్నికలను కేవలం గెలుపోటముల అంశంగా చూడకూడదని చంద్రబాబు సూచించారు. భవిష్యత్తులో పార్టీకి ఉపయోగపడే నాయకత్వాన్ని తయారు చేసుకోవడానికి ఇవి మంచి అవకాశాలని పేర్కొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్నవారు, విద్యావంతులు, యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాబోయే 30 ఏళ్లపాటు పార్టీకి ఉపయోగపడేలా గ్రామస్థాయి నుంచి బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

కేంద్రం నుంచి గ్రామం వరకు కూటమి పాలన

కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ కూటమి అధికారంలో ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. గ్రామ పంచాయతీల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధిస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే వారి ఆదరణ ఎప్పటికీ కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. అధికారాన్ని ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు.

గొడవలకు దూరంగా ఉండాలి

ఎన్నికల సమయంలో ఎవరూ గొడవలకు దిగవద్దని చంద్రబాబు పార్టీ నేతలు, కార్యకర్తలను గట్టిగా హెచ్చరించారు. కొందరు హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి ప్రజాస్వామ్య పద్ధతులనే విశ్వసిస్తుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే విజయం సాధించాలని సూచించారు.

గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజల్లోనే ఉండాలి

ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని చంద్రబాబు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని ఆదేశించారు.

మరో 23 పట్టణ స్థానిక సంస్థలపై దృష్టి

రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు విజయభేరి మోగించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ఇప్పటికే సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత బలాన్ని పెంచుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మొత్తంగా స్థానిక ఎన్నికల విజయాలను భవిష్యత్తు రాజకీయ బలానికి పునాదిగా మార్చుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నేతలకు దిశానిర్దేశం చేశారు.

నామినేషన్ల వేళ ప్రత్యేక ఎస్కార్ట్..
అభ్యర్థులకు భద్రత కల్పిస్తాం!



-మొదటిపేజీ తరువాయి

మాట్లాడినట్లు పునేఠా వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల సమయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు భయాందోళనలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఎవరైనా తమకు దాడి ముప్పు ఉందని సంబంధిత ఎస్పీకి తెలియజేస్తే, పరిస్థితిని పరిశీలించి ప్రత్యేక ఎస్కార్ట్ కల్పిస్తారని చెప్పారు. పోలీసు వ్యవస్థ రాజకీయాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాలని స్పష్టం చేశారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు

పంచాయతీరాజ్ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా ప్రోత్సాహక నిధులు అందనున్నాయని ఎస్ఈసీ వివరించారు.
5 వేల వరకు జనాభా ఉన్న గ్రామానికి రూ.15 లక్షలు.
5,001 నుంచి 10 వేల వరకు జనాభా ఉన్న గ్రామానికి రూ.25 లక్షలు.
10 వేల మందికి పైగా జనాభా ఉన్న గ్రామానికి రూ.50 లక్షలు.
ఈ నిధులను గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలోని 15 నుంచి 20 శాతం గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంచనా వ్యక్తం చేశారు. అయితే ఏకగ్రీవ ఎన్నికలు బలవంతంగా జరగకూడదని, అభ్యర్థులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకూడదని స్పష్టం చేశారు.

ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత

ఈ నెల 19న ఎంపీపీలు, 20న జడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నిక నిర్వహించనున్నట్లు పునేఠా తెలిపారు. ఆయా పదవులకు సంబంధించిన ఎన్నికల విధివిధానాలను ఇప్పటికే ప్రకటించినట్లు చెప్పారు. పదవీ ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే వారి ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందని వెల్లడించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే శాంతిభద్రతలు కీలకమని, అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు అధికార యంత్రాంగం, పోలీసు శాఖ నుంచి మంచి సహకారం అందుతోందని ఎస్ఈసీ పేర్కొన్నారు.

ఏపీఎంపీఏ ఆధ్వర్యంలో ఇరువురికి ఆర్థిక సహాయం



గుడివాడ, మహానగర్

జిల్లాలోని పామర్రుకు చెందిన పేద విద్యార్థి విద్యాభ్యాసానికి, అనారోగ్యంతో బాధపడుతున్న మరో వ్యక్తి వైద్య ఖర్చులకు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) నాయకులు ఆర్థిక సహాయం అందించారు. ఏపీఎంపీఏ రాష్ట్ర నాయకుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ సూచన మేరకు వార్తా ప్రభ స్టేట్ చీఫ్ బ్యూరో యేమినేని వెంకటరమణ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు ఏపీఎంపీఏ గుడివాడ అధ్యక్షుడు గోసిపాతల శ్యాంబాబు తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా ఇటువంటి సహాయ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న వీర్ల శ్రీరామ్ యాదవ్‌కు, ఆర్థిక సహాయం అందించిన యేమినేని వెంకటరమణకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ జిల్లా ముఖ్య నాయకులు, సీనియర్ జర్నలిస్టులు కొక్కిలిగడ్డ శ్రీధర్, లగ్గిశెట్టి వెంకట ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సుజనా ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



విజయవాడ, మహానగర్

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని సుజనా ఫౌండేషన్ ద్వారా శనివారం చిట్టినగర్ సర్కిల్ వన్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజారోగ్యమే లక్ష్యంగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి వారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో దంత, కంటి పరీక్షలతో పాటు జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలు, బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరంలో 136 మందికి నిపుణులైన వైద్య బృందం పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసింది. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడమే సుజనా ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. శంకర నేత్ర చికిత్సాలయం, సిద్ధార్థ డెంటల్ హాస్పిటల్, హెల్ప్ హాస్పిటల్ వైద్యులు సేవలందించారు. కూటమి కార్పొరేటర్లు గుర్రం కనకదుర్గ, బెవర జోగేశ్వరరావు, నాయకులు మద్దిల రామకృష్ణ, నాగోతి రామారావు, వెంపలి గౌరీ శంకర్, బీఎస్‌కే పట్నాయక్, ఎం. అప్పారావు, దేవిన హరిప్రసాద్, ధనాల శ్రీనివాసరావు, చుక్కా నరేష్, పోకల నాగబాబు, కుంబా రవి, శీలం చందు, సాయి తేజ, ఆకారపు విజయకుమారి, సుజనా ఫౌండేషన్ సిబ్బంది, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొని సేవలందించారు.

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ఆగిరిపల్లి, మహానగర్

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వి.జి.ఎస్. కుమార్ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ రావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, ప్రోగ్రామ్ డెవలప్‌మెంట్ మేనేజర్ సత్యనారాయణ శర్మ హాజరయ్యారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నెహ్రూ జీవిత విశేషాలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, ముఖ్య అతిథులు బహుమతులతో పాటు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి

- బాలల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.వీరయ్య

విజయవాడ, మహానగర్



బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని బాలల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.వీరయ్య పేర్కొన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే బాలల హక్కుల వారోత్సవాలను విజయవాడ కబేలా సెంటర్ ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం, రక్షణ, గౌరవం, సమాన అవకాశాలు పొందే హక్కు ఉందని తెలిపారు. పరిశీలన గృహంలోని బాలురు గత అనుభవాలను జీవిత పాఠాలుగా తీసుకుని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తన, క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.చాంద్ భాషా, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కోఆర్డినేటర్ ఆరవ రమేష్, అమృత హస్తం ఫౌండేషన్ డైరెక్టర్ ధారా కరుణశ్రీ మాట్లాడుతూ బాలలు తమలోని ప్రతిభను గుర్తించి, గత తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. బాలల భవిష్యత్తుకు ప్రేమ, రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ శరత్ మాట్లాడుతూ బాలల సంక్షేమం, అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు కలిసి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం బాలలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి సాధారణ వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేపట్టారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా రానున్న రోజుల్లో బాలల హక్కులు, రక్షణ, ఆరోగ్యం, విద్యపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమృత హస్తం ఫౌండర్ ధారా రుక్మిణి, మాక్స్ విజన్ రీజినల్ సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ కలపల భీమా, బర్డ్ సంస్థ సెక్రటరీ టీ.ప్రకాష్ కుమార్, డీసీపీవో రాజేశ్వరరావు, ఇన్‌టేక్ ప్రొబేషన్ ఆఫీసర్ అలీ బెగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

- అభ్యర్థుల రోజువారీ ఎన్నికల వ్యయ రిజిస్టర్లను నిరంతరం తనిఖీ చేయాలి
- ర్యాలీలు, సభలు, ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి
- నగదు, మద్యం, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- రిటర్నింగ్ అధికారులకు రెండవ దశ బ్రీఫింగ్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణపై దిశానిర్దేశం
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ్ కుమార్



విజయవాడ, మహానగర్

జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించిన నిబంధనలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు రెండవ దశ బ్రీఫింగ్ సమావేశం శనివారం విజయవాడలోని ఇరిగేషన్ శాఖ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల వ్యయ నిర్వహణ, పర్యవేక్షణ, నిఘా బృందాల విధులు తదితర అంశాలపై అధికారులకు సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థులకు వ్యయ పరిమితిపై ముందుగానే అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి ఖర్చును నిర్ణీత నమూనాలో నమోదు చేసేలా చూడాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. అభ్యర్థులు తమ రోజువారీ ఎన్నికల వ్యయ రిజిస్టర్లను నిర్ణీత సమయాల్లో అకౌంటింగ్ బృందాలకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల వ్యయ వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించి, రికార్డులను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన షాడో రిజిస్టర్లను అకౌంటింగ్ బృందాలు తప్పనిసరిగా నిర్వహించాలని, వ్యయ నివేదికలు సమర్పించని అభ్యర్థులకు నిబంధనల ప్రకారం తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, ప్రచార వాహనాల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. మంజూరు చేసిన అనుమతుల వివరాలను వీడియో సర్వైలెన్స్, అకౌంటింగ్ బృందాలకు అందజేసి, వాస్తవంగా జరిగిన ఖర్చులను నమోదు చేసిన వ్యయ వివరాలతో సరిపోల్చాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాలపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, కానుకలు పంపిణీ చేయడం వంటి నిషేధిత చర్యలను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను గుర్తించిన వెంటనే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని నిఘా బృందాలు, అకౌంటింగ్ బృందాలు, ఎన్నికల వ్యయ నిర్వహణ యంత్రాంగం పనితీరును సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 16 నుంచి ఎరువుల పంపిణీకి నూతన విధానం అమలు

- ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్, కొనుగోళ్లు
- రైతులు ముందుగానే వివరాలు నమోదు చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్.తిరుమలాదేవి



విజయవాడ, మహానగర్

ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు ప్రవేశపెడుతున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ నూతన విధానాన్ని జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్. తిరుమలాదేవి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, సంచాలకుల ఆదేశాల మేరకు ప్రస్తుతం అమలులో ఉన్న ఏపీఏఐఎంఎస్ యాప్ స్థానంలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానం ఇప్పటికే కృష్ణా, కాకినాడ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసినట్లు తెలిపారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ముందుగానే బుక్ చేసుకోవాలి. ఇందుకు స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ ఐడీ, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ అవసరం. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బుకింగ్‌కు ముందు ఏపీఎఫ్ఆర్ లో రైతుల నమోదు తప్పనిసరి. రైతులు స్వయంగా లేదా గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది సహకారంతో నమోదు చేసుకోవచ్చు. ఆధార్ లేదా ఫార్మర్ ఐడీ ద్వారా ఓటిపి ధృవీకరణ పూర్తయిన తర్వాత ఏపీఎఫ్ఆర్ లో నమోదైన భూముల వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. నమోదు కాని భూముల వివరాలను కూడా యాప్‌లో చేర్చుకునే అవకాశం ఉండగా, రైతు సేవా కేంద్రం సిబ్బంది వాటిని పరిశీలించి ఆమోదిస్తారు. కౌలు, వారసత్వ, అటవీ పట్టాలు, దేవాలయ, ప్రభుత్వ తదితర భూములకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించారు. రైతులు భూమి విస్తీర్ణం, పంట వివరాలు నమోదు చేసిన తర్వాత సిఫార్సు చేసిన ఎరువుల పరిమాణం యాప్‌లో కనిపిస్తుంది. ఇందులో యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువుల వివరాలు ఉంటాయి. యూరియా, డీఏపీ సిఫార్సు పరిమాణాల్లో మార్పు ఉండదు. ఇతర ఎరువుల ఎంపికలో రైతులకు వెసులుబాటు ఉంటుంది. రైతులు రాష్ట్రంలో ఎక్కడైనా లేదా పొరుగు రాష్ట్రాల్లోనైనా తమకు అనుకూలమైన ఎరువుల దుకాణాన్ని ఎంపిక చేసుకొని బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ పూర్తయిన తర్వాత ప్రతి దుకాణానికి ప్రత్యేక క్యూఆర్ కోడ్, టోకెన్ నంబర్ జారీ అవుతాయి. క్యూఆర్ కోడ్‌ను వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా ఇతరులకు పంపించుకోవచ్చు. రైతు తరఫున మరొకరు ఎరువులు కొనుగోలు చేయాలనుకుంటే వారి ఆధార్, మొబైల్ వివరాలు నమోదు చేయాలి. క్యూఆర్ కోడ్ జారీ అయిన 48 గంటల్లోపు ఎరువులు కొనుగోలు చేయాలి. ఆ గడువులో కొనుగోలు చేయని బుకింగ్‌లు ఆటోమేటిక్‌గా రద్దవుతాయి. కొనుగోలు సమయంలో డీలర్‌కు క్యూఆర్ కోడ్ చూపిస్తే, ఈ-పాస్ యంత్రం ద్వారా స్కాన్ చేసి ఎరువులు అందజేస్తారు. బుక్ చేసిన పరిమాణం కంటే తక్కువ కొనుగోలు చేయవచ్చు కానీ ఎక్కువ కొనుగోలు చేయడానికి అవకాశం ఉండదు. భూముల వివరాలకు సంబంధించి వివాదాలు తలెత్తినప్పుడు మండల వ్యవసాయ అధికారి ద్వారా పరిష్కరించే వెసులుబాటు కల్పించారు. ప్రతి ఎరువుల దుకాణంలో రైతుల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ఎంఏఓ., ఏఏ., లాగిన్లను అందుబాటులో ఉంచారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచడంతో పాటు, రైతులకు సులభంగా ఎరువులు అందించడమే ఎఫ్ఎఫ్ఎస్ విధానం ప్రధాన ఉద్దేశమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. కావున రైతులందరూ ముందుగానే ఏపీఎఫ్ఆర్ లో తమ వివరాలు నమోదు చేసుకొని, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సూచనలు పాటిస్తూ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

డీలిమిటేషన్ దిశగా అడుగులు

దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన డీలిమిటేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటికీ రాష్ట్రపతి అధికారికంగా ముగించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952, 1963, 1973 మరియు 2002 సంవత్సరాల్లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయివర్షాకాల సమావేశాలు ఇంకా ప్రొరోగ్ కానందున, కొత్త సమావేశాల కోసం 14 రోజుల గడువు అవసరం లేకుండా కేవలం 48 గంటల ముందుగా ఎంపీలకు సమాచారం ఇచ్చి ప్రత్యేక భేటీని నిర్వహించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకేతాలు ఇచ్చారు.సాధారణంగా పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుండి నాలుగు రోజుల్లోనే రాష్ట్రపతి సభను ప్రొరోగ్ చేస్తారు. కానీ, ఈసారి వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 90 రోజులకు చేరువవుతున్నా సభను అధికారికంగా ముగించకపోవడంతో 2008 నాటి 87 రోజుల రికార్డు సైతం బద్దలైంది. గత ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుండి 850 వరకు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది వీగిపోయింది.ఈ నేపథ్యంలో, ఈసారి పక్కా సంఖ్యాబలాన్ని కూడగట్టుకుని, ఎప్పుడైనా సరే 48 గంటల షార్ట్ నోటీసుతో సభను సమావేశపరిచి బిల్లును గట్టెక్కించాలని కేంద్రం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా ఉండేవి. వీటిలో ఒకరు సాధారణ అభ్యర్థి, మరొకరు రిజర్వుడు అభ్యర్థిగా ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది.ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేంది తర్వాత మళ్లీ తగ్గిపోయింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మేరకు డీ లిమిటేషన్ సిఫార్సులే.ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలు ఉండేవి 1962లో 522 పార్లమెంటు స్థానాలు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు స్థానాలు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు స్థానాలకు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంటుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.మరోవైపు, కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియే 'డీలిమిటేషన్' ఇది మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడి ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో స్థానాలు పెరిగి, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల (తెలుగు రాష్ట్రాలతో సహా) ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.2026 తర్వాత జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి సుమారు 850 వరకు పెరిగే అవకాశం ఉంది. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రకారం, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరుగుతాయి, కానీ జనాభా నియంత్రణ పాటించిన తెలుగు రాష్ట్రాలు , కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రాతినిధ్యం (లోక్‌సభ సీట్లు) తగ్గుతుందనే భయం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను నష్టపరిచే విధంగా ఈ విభజన ఉండకూడదని పలువురు ఎంపీలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ బిల్లుపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి, ఇది దేశ రాజకీయ సమతుల్యతను మార్చే అవకాశం ఉన్నందున చాలా సున్నితమైన అంశంగా మారింది.రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన రెండు మూడొంతుల మెజారిటీని అడ్డదారిలో కూడగట్టుకునేందుకు అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయకుండా జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

10 లక్షల కోట్ల పెట్టుబడులు



విశాఖపట్టణం : విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా 303 ప్రతిపాదనల రూపంలో ఏపీకి ఏకంగా రూ. 9.89 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, చేనేత క్లస్టర్ల వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయన్నారు. జూన్ 2024 నుంచి ఈ సమ్మిట్‌కు ముందు వరకు 714 ప్రాజెక్టులకు రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. సీఐఐ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'స్వచ్ఛ షహర్' కేటగిరీలో దేశంలోనే అత్యంత శుభ్రమైన నగరంగా విశాఖపట్నం నిలిచిందని, అలాంటి అద్భుతమైన నగరంలో ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ 2017లో ఆంధ్రప్రదేశ్‌లో తన తొలి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో అనంతపురం జిల్లాలో ప్రారంభమైన ఈ పరిశ్రమ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పుడు అదే సంస్థ మరో భారీ పెట్టుబడికి సిద్ధమవుతుండటం ఏపీలో ఉన్న పారిశ్రామిక అవకాశాలకు నిదర్శనంగా నిలుస్తోంది.కియా ఇండియా సీఈఓ గ్వాంగ్గు లీ సీఐఐ సదస్సులో ఈ పెట్టుబడి ప్రతిపాదనను వెల్లడించారు. కొత్త ప్లాంట్ ద్వారా సుమారు 12 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏడాదికి 4.3 లక్షల వాహనాలను తయారు చేస్తున్న సంస్థ.. కొత్త విస్తరణతో ఈ సామర్థ్యాన్ని 6.3 లక్షలకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఏపీలోని ప్లాంట్ నుంచి 100 దేశాలకు 4.1 లక్షలకు పైగా వాహనాలు, కిట్లను ఎగుమతి చేయడం విశేషం.చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇప్పుడు పెట్టుబడుల ప్రకటనలకే పరిమితం కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 2024లో కుదిరిన పెట్టుబడి ఒప్పందాల్లో 58 శాతం ఇప్పటికే ప్రాజెక్టుల అమలు దశకు చేరుకున్నాయని సీఎం వెల్లడించారు. పరిశ్రమలు రావడం, ఉత్పత్తి ప్రారంభం కావడం, ఉద్యోగాలు కల్పించడం.. ఇవే పెట్టుబడుల విజయానికి అసలైన కొలమానాలని ఆయన స్పష్టం చేశారు.ఇదే క్రమంలో పెట్టుబడిదారులకు ప్రభుత్వ మార్పులతో సంబంధం లేకుండా భరోసా కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కంపెనీలకు ప్రకటించిన ప్రోత్సాహకాలు ఆలస్యం లేకుండా అందించేందుకు ఎస్క్రో వ్యవస్థను కూడా ప్రతిపాదించింది. ఈ చర్యలు అమల్లోకి వస్తే పెట్టుబడిదారుల్లో ప్రభుత్వ విధానాలపై విశ్వాసం మరింత పెరిగే అవకాశం ఉంది.కేవలం పరిశ్రమలు, పెట్టుబడులకే చంద్రబాబు తన లక్ష్యాలను పరిమితం చేయడం లేదు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలవాలని, తెలుగు ప్రజలు ప్రపంచవ్యాప్తంగా బలమైన గుర్తింపు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికతలను సమర్థంగా వినియోగించుకుంటే భారత్ 10 శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని సాధించే అవకాశముందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏపీ అభివృద్ధికి టెక్నాలజీ, తయారీ రంగం కీలక చోదకశక్తులుగా మారనున్నాయని ఆయన సంకేతాలిచ్చారు.చంద్రబాబు ప్రస్తావించిన మరో కీలక అంశం ఖ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్). ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజలు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది ఈ ఆలోచన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. కంపెనీలు కేవలం లాభాలకే పరిమితం కాకుండా తమ వనరులు, పరిజ్ఞానం, నైపుణ్యాలను సామాజిక అభివృద్ధికి కూడా వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు.కియా రూ.17 వేల కోట్ల పెట్టుబడి ప్రతిపాదన ఏపీకి దక్కిన మరో పారిశ్రామిక అవకాశంగా నిలుస్తోంది. అంతకంటే ముఖ్యంగా రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇది ఊతమిస్తోంది. అయితే ఈ పెట్టుబడి ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చి, పరిశ్రమల నిర్మాణం పూర్తయి, స్థానిక యువతకు ఉద్యోగాలు లభించినప్పుడే ఈ ప్రకటనకు పూర్తి సార్థకత చేకూరుతుంది. 2047 విజన్ దిశగా చంద్రబాబు వేస్తున్న అడుగుల్లో కియా విస్తరణ ఎంత కీలకంగా మారుతుందో రాబోయే రోజులు తేల్చనున్నాయి.'నేవిగేటింగ్ ద న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ పేరిట జరిగిన ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ముఖ్యంగా రిలయన్స్ సంస్థ రూ. 2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకోగా, కియా సంస్థ ఏడాదికి అదనంగా మరో 2 లక్షల కార్ల తయారీ కోసం రూ. 19000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నాలా యాక్ట్‌ను రద్దు చేశామని చెప్పారు. కేవలం 13 లైసెన్సుల ద్వారా 5 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను తీసుకువచ్చామని, పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల కోసం నిన్నటి నుంచే ఎస్క్రో ఖాతా అమల్లోకి వచ్చిందన్నారు. పారిశ్రామిక సంస్కరణల్లో ఎస్క్రో ఖాతా ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని, పెట్టుబడుల రక్షణ కోసం త్వరలోనే 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను కూడా తీసుకురానున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. 2024 నుంచి వచ్చిన 714 ప్రతిపాదనల్లో 522 ప్రతిపాదనలు వాస్తవ రూపంలోకి వస్తున్నాయని తెలిపారు.భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, 'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ' విధానం ద్వారా ప్రతి కుటుంబం నుంచి నిపుణులను తయారు చేస్తామన్నారు. తాను గతంలో ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని తెలుగువారిని ప్రపంచ నిపుణులుగా నిలిపినట్లే ఇప్పుడు ఏఐలోనూ ముందుంటామని సీఎం చంద్రబాబు అన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశ లక్ష్యం 500 గిగావాట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతి ఇంటిపైనా సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయం పూర్తి చేసుకోవడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, సౌత్ కోస్టల్ రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను సాకారం చేసుకున్నామని పేర్కొన్నారు.

యూపీలో ఓవైసీ కూటమి

లక్నో : యూపీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ కాన్షీరాం అధ్యక్షుడు, నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ అధికారికంగా రాజకీయ పొత్తును ప్రకటించారు. లక్నో వేదికగా నవంబర్ 12న వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించి యూపీలో కొత్తగా సామాజిక పరివర్తన మోర్చా పేరిట మూడో కూటమికి తెరలేపారు. ఇండియా కూటమిలో తమకు స్థానం కల్పించాలంటూ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లకు ఒవైసీ ఇచ్చిన గడువు ముగియడం, అఖిలేష్ యాదవ్ మొండిచేయి చూపడంతో.. ఒవైసీ నేరుగా చంద్రశేఖర్ ఆజాద్‌తో జట్టుకట్టి యూపీలో 'దళిత-ముస్లిం' కాంబినేషన్‌ను సెట్ చేశారు.యూపీ రాజకీయాల్లో దశాబ్దాల పాటు దళిత ఓటుబ్యాంకుకు ఏకైక అధినేత్రిగా వెలుగొందిన బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రభావం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో బలహీనపడటంతో, ఆ రాజకీయ శూన్యతను నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వేగంగా భర్తీ చేస్తున్నారు. ముఖ్యంగా యువ దళిత ఓటర్లలో ఆజాద్‌కు పెరుగుతున్న ఆదరణను గుర్తించిన ఒవైసీ.. రాష్ట్రంలోని దాదాపు 40 శాతం వరకు ఉన్న ముస్లిం మైనారిటీ ఓట్లను, దళిత ఓట్లను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఈ వ్యూహాత్మక పొత్తు కుదుర్చుకున్నారు. బలహీనవర్గాలు, యువత, రైతుల హక్కుల కోసం తమ కూటమి పోరాడుతుందని ఇరువురు నేతలు స్పష్టం చేస్తూనే, ఇప్పటివరకు దళితులు, ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకున్న ప్రధాన పార్టీలకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కొత్త కూటమి ఆవిర్భావం ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఏ స్థాయి ప్రభావం చూపిస్తుందన్నది ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారింది. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్థానాల్లో పశ్చిమ యూపీ, రోహిల్‌ఖండ్, పూర్వాంచల్ ప్రాంతాల్లోని సంభల్, రాంపూర్, మీరట్, నగీనా, ఆజంగఢ్, బహ్రాయిచ్, శ్రావస్తి, కుందర్కి వంటి సుమారు 150 స్థానాల్లో ఈ కూటమి పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం 5 మున్సిపల్ చైర్మన్ పీఠాలు, 83 కౌన్సిలర్ స్థానాలను



గెలుచుకోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్ సత్తా చాటడం వీరి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గత 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇరు పార్టీలూ ఖాతా తెరవకపోయినప్పటికీ, ఈసారి కలిసి బరిలోకి దిగడం ద్వారా సమీకరణాలను మార్చాలని చూస్తున్నాయి. ఒకవేళ సామాజిక పరివర్తన మోర్చా గణనీయమైన స్థాయిలో దళిత, ముస్లిం ఓట్లను చీల్చగలిగితే.. అది నేరుగా అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి ఫార్ములా విజయవకాశాలకు భారీ గండికొట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న 40-45 నియోజకవర్గాల్లో ఒవైసీ పార్టీ అభ్యర్థులు చీల్చే ఓట్లు అఖిలేష్ యాదవ్‌కు పెద్ద తలనొప్పిగా మారనున్నాయి. అదే సమయంలో బీఎస్పీ ఒంటరి పోరుకు సిద్ధమవుతుండటంతో దళిత ఓటుబ్యాంకు మాయావతి, చంద్రశేఖర్ ఆజాద్ మరియు ఎస్పీల మధ్య చీలిపోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.మొత్తానికి, మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ఒకవైపు, దాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న 'ఇండియా' కూటమికి మరోవైపు.. ఒవైసీ-ఆజాద్ జోడీ ఇప్పుడు అతిపెద్ద సవాలుగా నిలిచింది. మాయావతి నిస్తేజంతో విసిగిపోయిన దళితులు, అఖిలేష్ యాదవ్ వైఖరిపై అసంతృప్తితో ఉన్న ముస్లిం వర్గాలు ఈ కొత్త వేదిక వైపు ఆకర్షితులైతే యూపీ ఎన్నికల ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ కొత్త కూటమి కేవలం ప్రతిపక్ష ఓట్లను చీల్చే శక్తిగానే మిగిలిపోయి బీజేపీకి పరోక్షంగా లాభం చేకూరుస్తుందా, లేక బీహార్ తరహాలో యూపీ రాజకీయాల్లోనూ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా అవతరిస్తుందా అనేది రాబోయే 2027 ఎన్నికల రణరంగంలో తేలనుంది.

ఇజ్రాయెల్ అమ్ములపొదిలో సూపర్ ఐస్

టెల్ అవీవ్: రక్షణ రంగంలో సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఇజ్రాయెల్ మరో అధునాతన క్రూయిజ్ క్షిపణిని ఆవిష్కరించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖ రక్షణ సంస్థ రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ 'సూపర్ ఐస్' పేరుతో ఈ క్షిపణిని పరిచయం చేసింది. సుమారు 1,000 పౌండ్లు (453 కిలోలు) బరువున్న వార్‌హెడ్‌ను మోసుకెళ్లగల సామర్థ్యం దీని ప్రత్యేకతగా సంస్థ వెల్లడించింది. యుద్ధ విమానాలు, నౌకలు, భూతల ప్రయోగ వేదికల నుంచి ప్రయోగించేందుకు వీలుగా దీనిని రూపొందించినట్లు తెలిపింది. అయితే క్షిపణి పూర్తి స్థాయి సాంకేతిక వివరాలు, పరిధి, ధర, సైన్యంలో ప్రవేశపెట్టే తేదీపై ఇంకా స్పష్టత లేదు.

ఐస్ బ్రేకర్‌కు మరింత శక్తిమంతమైన రూపం

గతంలో రాఫెల్ అభివృద్ధి చేసిన 'ఐస్ బ్రేకర్' క్షిపణికి సూపర్ ఐస్ తదుపరి తరం రూపంగా ప్రచారం అవుతోంది. పాత వెర్షన్‌తో పోలిస్తే కొత్త క్షిపణి భారీ వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదని సంస్థ పేర్కొంది. సుమారు 453 కిలోల పేలుడు సామర్థ్యం ఉండటం వల్ల కీలకమైన సైనిక లక్ష్యాలను ఛేదించేందుకు దీనిని రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే పాత, కొత్త క్షిపణుల బరువు, వేగం, పరిధికి సంబంధించిన పోలికలను అధికారిక సాంకేతిక వివరాలతో ధ్రువీకరించాల్సి ఉంది.

బహుళ ప్రయోగ వేదికల నుంచి దాడి

సూపర్ ఐస్ రూపకల్పనలో ప్రధాన ప్రత్యేకత దాని బహుళ ప్రయోగ సామర్థ్యం. యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు,



భూతల ప్రయోగ వేదికల నుంచి ప్రయోగించేలా దీనిని అభివృద్ధి చేసినట్లు రాఫెల్ వెల్లడించింది. ఇలాంటి సామర్థ్యం వల్ల వివిధ యుద్ధ పరిస్థితుల్లో వినియోగించుకునే వెసులుబాటు లభిస్తుంది. ఇజ్రాయెల్ వైమానిక దళంలోని ఎఫ్-35, ఎఫ్-16, ఎఫ్-15 యుద్ధ విమానాలతో అనుసంధానం చేసే అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

జీపీఎస్‌పై ఆధారపడని మార్గదర్శక వ్యవస్థ

ఈ క్షిపణిలో ఎలక్ట్రో-ఆప్టికల్ గైడెన్స్, ఇమేజ్ రికగ్నిషన్ వంటి సాంకేతికతలను ఉపయోగించినట్లు కథనంలో పేర్కొన్నారు. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలకు అంతరాయం కలిగినా లక్ష్యాన్ని గుర్తించే సామర్థ్యం దీనికి ఉండొచ్చని రక్షణ రంగ విశ్లేషణలు చెబుతున్నాయి. అవసరమైన పరిస్థితుల్లో ప్రయోగం అనంతరం మానవ నియంత్రణ ద్వారా మార్గదర్శనం చేసే సదుపాయం కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఈ సామర్థ్యాల పూర్తి వివరాలను సంస్థ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

తక్కువ ఎత్తులో ప్రయాణించే సామర్థ్యం

శత్రు రాడార్ల గుర్తింపును తప్పించుకునేలా తక్కువ ఎత్తులో ప్రయాణించే క్రూయిజ్ క్షిపణుల రూపకల్పన సాధారణంగా జరుగుతుంది. సూపర్ ఐస్‌లోనూ ఇలాంటి లక్షణాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. లక్ష్యాన్ని గుర్తించడం, దాడి సమయంలో మార్గాన్ని సర్దుబాటు చేసుకోవడం వంటి సామర్థ్యాలు దీనికి అదనపు బలంగా నిలవవచ్చని రక్షణ రంగ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే దీని వేగం, రాడార్ గుర్తింపు స్థాయి, వాతావరణ పరిస్థితుల్లో పనితీరుపై నిర్దిష్ట వివరాలు అందుబాటులో లేవు.

ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యం

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలోని వివిధ ప్రాంతాల్లో సాయుధ గ్రూపులతో ఘర్షణల నేపథ్యంలో ఈ క్షిపణి ఆవిష్కరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ మద్దతు ఉన్న హమాస్, హిజ్బుల్లా, హూతీలు తదితర గ్రూపులతో ఇజ్రాయెల్‌కు ఘర్షణలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఇరాన్ తన క్షిపణి సామర్థ్యాలను విస్తరిస్తోంది. ఈ పరిస్థితుల్లో సుదూర లక్ష్యాలను ఛేదించగల అధునాతన ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేయడంపై ఇజ్రాయెల్ దృష్టి సారిస్తున్నట్లు రక్షణ రంగ విశ్లేషకులు భావిస్తున్నారు.

అయోధ్య-జనక్‌పూర్ మధ్య వారాంతపు రైలు

న్యూఢిల్లీ: భారత్--నేపాల్ మధ్య ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య కంటోన్మెంట్ వరకు కొత్త వారాంతపు రైలు సర్వీసుకు ఆమోదం తెలిపింది. నవంబర్ 14న రైల్వే మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని అధికారి కంగా ప్రకటించింది. రామాయణ ఇతిహాసంతో ముడిపడిన సీత మ్మ జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన జనక్‌పూర్ ధామ్‌ను, శ్రీరా ముడి జన్మస్థలమైన అయోధ్యను ఈ రైలు అనుసంధా నించనుంది. దీంతో రెండు దేశాల మధ్య ప్రయాణించే భక్తులు, పర్యాటకులు, సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది.

వారానికి ఒకసారి రాకపోకలు

రైల్వే శాఖ ప్రకటన ప్రకారం ఈ రైలు వారానికి ఒకసారి నడుస్తుంది. ప్రతి శనివారం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి బయలుదేరి అయోధ్య కంటోన్మెంట్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి సోమవారం అయోధ్య కంటోన్మెంట్ నుంచి బయలుదేరుతుంది. మొత్తం ప్రయాణ దూరం సుమారు 604 కిలోమీటర్లుగా రైల్వే శాఖ పేర్కొంది.

మార్గమధ్యలో ప్రధాన స్టేషన్లు

ఈ రైలు జనక్‌పూర్ ధామ్, అయోధ్య కంటోన్మెంట్ టెర్మినల్ స్టేషన్లతో పాటు జయనగర్, మధుబనీ, శిషో, సీతామఢి,



రక్సాల్, నర్కటియాగంజ్, గోరఖ్‌పూర్, బస్తీ, మన్కాపూర్, అయోధ్య ధామ్ స్టేషన్లలో ఆగనుంది. బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని పలు పట్టణాల మీదుగా ప్రయాణించే ఈ సర్వీసు సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా ఉపయోగపడనుంది.

రామాయణ సర్క్యూట్‌కు ఊతం

అయోధ్య-జనక్‌పూర్ మధ్య రైలు అనుసంధానం ఏర్పడటం తో రామాయణ సర్క్యూట్ ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. రెండు దేశాల భక్తులు ఈ పవిత్ర క్షేత్రాలను సులభంగా సందర్శించేందుకు వీలవుతుంది. విద్య, వ్యాపారం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణించే వారికి కూడా ఈ సర్వీసు ఉపయోగపడుతుందని రైల్వే శాఖ వెల్లడించింది. రైలు మార్గంలోని హోటళ్లు, పర్యాటక సంస్థలు, స్థానిక వ్యాపారులు, సంప్రదాయ హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

భద్రత, కస్టమ్స్ ఏర్పాట్లపై సమన్వయం

ఇది అంతర్జాతీయ సరిహద్దును దాటే రైలు సర్వీసు కావడంతో ప్రయాణికుల భద్రత, కస్టమ్స్, ఇమిగ్రేషన్ తనిఖీల నిర్వహణపై భారత్, నేపాల్ అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. నేపాల్ భూభాగంలో అక్కడి భద్రతా సంస్థలు, భారత భూభాగంలో భారత భద్రతా సంస్థలు బాధ్యతలు నిర్వహించేలా చర్చలు జరిగినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ నెల ప్రారంభంలో 17 బోగీలతో కూడిన భారతీయ రైలు జయనగర్ నుంచి కుర్తా వరకు ట్రయల్ రన్ నిర్వహించినట్లు కూడా సమాచారం.

తొలుత భారతీయ రైల్వే నిర్వహణ

ప్రారంభ దశలో ఈ రైలును భారతీయ రైల్వే నిర్వహించనుంది. టికెట్ ధరలు, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను కూడా భారతీయ రైల్వేనే నిర్ణయించనుందని నేపాల్ రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ పరిబేష్ పరాజులి వెల్లడించినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ప్రయాణికుల రద్దీని బట్టి భవిష్యత్తులో సర్వీసుల సంఖ్యను పెంచే అవకాశం ఉందని తెలిపారు.

భారత్‌కు అదనపు ప్రయోజనం ఉండాలి

న్యూఢిల్లీ: భారత్--అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పంద చర్చలు తుది దశకు చేరుకున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. సుంకాలతో సహా చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని, మరికొన్ని అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే మిగిలిన అంశాల్లో చాలా వరకు అమెరికా వైపు నుంచి పరిష్కారం కావాల్సి ఉందని పేర్కొన్నారు. హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో కుదిరే వాణిజ్య ఒప్పందం భారత్‌కు ప్రయోజనకరంగా, సమతుల్యంగా ఉండాలని జైశంకర్ స్పష్టం చేశారు. ఇతర సమాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారత్‌కు కొంత అదనపు ప్రయోజనం కలిగించేలా ఒప్పందం ఉండాలన్నది తమ ఆకాంక్షగా పేర్కొన్నారు. చర్చల చివరి దశలో ఇరు దేశాల మధ్య కొన్ని అంశాలపై అసహనం ఉండటం సహజమేనని, అయితే పరస్పర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఆసియా దేశాలతో భారత్ కుదుర్చుకున్న కొన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు లభించలేదని జైశంకర్ అభిప్రాయపడ్డారు. అయితే ఇటీవలి సంవత్సరాల్లో భారత్ కుదుర్చుకున్న ఒప్పందాలను సమగ్ర ఆర్థిక, వ్యూహాత్మక విశ్లేషణ తర్వాతే రూపొందిస్తున్నట్లు తెలిపారు.

అమెరికా అతిపెద్ద మార్కెట్

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా భారత్‌కు కీలకమైన మార్కెట్ అని జైశంకర్ పేర్కొన్నారు. అలాంటి దేశంతో వాణిజ్య ఒప్పందం కుదరడం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. అమెరికా



అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ మార్కెట్లను విస్తరించుకునేందుకు పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై దృష్టి సారిస్తున్నారని వివరించారు. ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన మధ్యేమార్గాన్ని కనుగొనడమే ప్రస్తుతం ప్రధాన సవాలని అన్నారు. వాణిజ్య ఒప్పందాలు కేవలం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పూర్తయ్యేవి కావని, వాటి ప్రభావం ప్రజల ఉపాధి, జీవనోపాధి అవకాశాలపై ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

చైనా సరిహద్దులో అప్రమత్తత అవసరం

మరోవైపు చైనాతో సరిహద్దు పరిస్థితులపైనా జైశంకర్ స్పందించారు. భారత్--చైనా సరిహద్దు మరింత క్రియాశీలంగా మారిందని, అక్కడ నిరంతరం భారీ సంఖ్యలో సైన్యాన్ని మోహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై భారత్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి భారత్ తన సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసిందని తెలిపారు. సరిహద్దు భద్రత విషయంలో నిరంతర అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు.

చైనా పారిశ్రామిక అభివృద్ధిపై ప్రస్తావన

భారత్, చైనా ఆర్థిక వ్యవస్థల మధ్య పెరిగిన అంతరంపై అడిగిన ప్రశ్నకు జైశంకర్ స్పందిస్తూ గత దశాబ్దాల పరిణామాలను వివరించారు. 1988లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చైనాను సందర్శించిన సమయంలో ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమాన స్థాయిలో ఉన్నాయని గుర్తుచేశారు. ఆ తర్వాత చైనా ఆధునీకరణ, పారిశ్రామికీకరణపై భారీగా దృష్టి పెట్టిందన్నారు. 1980వ దశకంలో భారత్ పారిశ్రామికీకరణకు సంబంధించిన అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయిందని అభిప్రాయఎ డ్డారు. 1990వ దశకంలో సంస్కరణలు ప్రారంభిం చినప్పటికీ, వాటిని అన్ని రంగాలకు విస్తరించి నిరంతర అభివృద్ధిని సాధించడంలో వెనుకబడిపోయామని విశ్లేషించారు.

ఒప్పందంపై ఉత్కంఠ

భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారైతే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు కొత్త ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా సుంకాలు, మార్కెట్ ప్రవేశం, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన నిబంధనలు ఇరు దేశాల వ్యాపార రంగాలపై ప్రభావం చూపనున్నాయి. అయితే ఒప్పందంలోని తుది షరతులు, అమలు తేదీ, రంగాలవారీ ప్రయోజనాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అమితాబ్ బచ్చన్ 'జల్సా' బంగ్లా వివాదం..
రంగంలోకి మరదలు రమోలా బచ్చన్!

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌కు చెందిన ముంబైలోని ప్రసిద్ధ బంగ్లా 'జల్సా' యాజమాన్య హక్కులపై బచ్చన్ కుటుంబంలో వివాదం మొదలైంది. అమితాబ్ తమ్ముడు అజితాబ్ బచ్చన్ భార్య రమోలా బచ్చన్ ఈ ఆస్తిపై న్యాయపరమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 1993లో జల్సా బంగ్లా యాజమాన్య హక్కులను జయా బచ్చన్‌కు బదిలీ చేస్తూ కుదిరిన 'గిఫ్ట్ డీడ్'ను ఆమె తీవ్రంగా సవాల్ చేశారు. తన ప్రమేయం, అనుమతి లేకుండానే ఈ బదిలీ జరిగిందని ఆరోపిస్తూ ఆ పత్రాల చెల్లుబాటును రమోలా ప్రశ్నించారు.

ముంబైలోని కపోల్ హౌసింగ్ సొసైటీ రికార్డుల్లో జల్సా బంగ్లా యజమానిగా జయా బచ్చన్ పేరు నమోదై ఉంది. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వ ప్రాపర్టీ కార్డులో మాత్రం ఇప్పటికీ రమోలా బచ్చన్ పేరే కొనసాగుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో రమోలా పేరును తొలగించి, జయా బచ్చన్ పేరును చేర్చేందుకు ప్రయత్నాలు జరిగిన సమయంలోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి జల్సా బంగ్లా తొలుత తన పేరిట నమోదై ఉందని రమోలా పేర్కొంటు న్నారు. 1993 నాటి గిఫ్ట్ డీడ్‌ను సాధారణ కాగితంపై రూపొందించారని, ఆ సమయంలో దానికి ఎలాంటి స్టాంప్ డ్యూటీ చెల్లించలేదని, కనీసం సాక్షుల సంతకాలు కూడా లేవని ఆమె ఆరోపించారు. ఆ తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వ 'అభయ్ యోజన' పథకం కింద ఆ డీడ్‌ను క్రమబద్ధీకరించిన విధానంపై కూడా ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై గత ఏడు నెలలుగా రమోలా బచ్చన్ పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో, ప్రస్తుతం ఈ వ్యవహారం అంధేరిలోని కో-ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎదుట విచారణకు వచ్చింది. సంబంధిత పక్షాల నుంచి వివరణలు కోరగా, విచారణ కొనసాగుతోంది. ఇంకా ఎలాంటి తుది నిర్ణయం వెలువడలేదు. ఈ పరిణామాలపై అమితాబ్ బచ్చన్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. జయా బచ్చన్ సైతం స్పందించేందుకు అందుబాటులోకి రాలేదు. కాగా, నటుడు అభిషేక్ బచ్చన్ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. ఇది పూర్తిగా వారి కుటుంబ అంతర్గత విషయమని, దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్పష్టం చేశారు. ముంబై జుహులోని 'జల్సా' అమితాబ్ బచ్చన్ నివాసంగానే కాకుండా, ప్రతి ఆదివారం ఆయన తన అభిమానులను కలుసుకునే కేంద్రంగా కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

ఢిల్లీలో కాలుష్యం 400 దాటింది



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఇచ్చిన 'అబ్ కీ బార్ 400 పార్' నినాదాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ప్రస్తుతం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 400 మార్కును దాటడాన్ని ప్రస్తావిస్తూ.. ఆ నినాదం ఇప్పుడు మరో అర్థంలో నిజమైందని ఎద్దేవా చేసింది.

జైరాం రమేశ్ ఘాటు విమర్శలు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'అబ్ కీ బార్.. ఏక్యూఐ 400 పార్' అంటూ ప్రధాని నినాదాన్ని మార్చి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తరచూ ఉపన్యాసాలు ఇచ్చే ప్రధానిని 'ప్రవచనమంత్రి'గా అభివర్ణిస్తూ విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో 400కు పైగా లోక్‌సభ స్థానాలు సాధించాలన్న లక్ష్యంతో ఇచ్చిన నినాదం.. ఇప్పుడు ఢిల్లీ కాలుష్యం విషయంలో నిజమైందని పేర్కొన్నారు.

ఊపిరి తీసుకోవడమే కష్టంగా మారింది

ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ దిగజారుతోందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. గాలి విషపూరితంగా మారడంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయని, ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య కూడా అధికమవుతోందని విమర్శించారు.

400 దాటిన ఏక్యూఐ

నగరంలోని పలు గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్లో గత కొన్ని రోజులుగా ఏక్యూఐ 400 నుంచి 500 మధ్య నమోదవుతున్నట్లు కథనంలో పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీ సగటు ఏక్యూఐ కూడా 400 మార్కును దాటింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

అయ్యప్ప భక్తులకు భారీ ఊరట

శబరిమల అయ్యప్ప స్వామి భక్తులకు భారీ ఊరట లభించింది. యాత్రలో అత్యంత కీలకమైన చలక్కాయం-పంబ రహదారి ఆధునికీకరణ పనులు రికార్డు సమయంలో పూర్తయ్యాయి. సుమారు రూ. 15 కోట్ల వ్యయంతో చేపట్టిన 4.5 కిలోమీటర్ల ఈ రహదారి పునరుద్ధరణను పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) కేవలం 30 రోజుల్లోనే విజయవంతంగా పూర్తి చేసింది. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రెండు నెలల మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను యుద్ధప్రాతిపదికన ముగించారు. శబరిమల కొండపైకి కాలినడకన వెళ్లే భక్తులకు పంబ బేస్ క్యాంప్‌గా వ్యవహరిస్తుంది. రోడ్డు మార్గంలో వచ్చే అయ్యప్ప భక్తులు పంబ చేరుకోవడానికి చలక్కాయం-పంబ మార్గమే ప్రధాన ఆధారంగా ఉంది. రాబోయే వారాల్లో లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని తట్టుకునేలా, ప్రయాణాన్ని మరింత సురక్షితం చేసేందుకు ఈ మార్గాన్ని ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దారు. గతంలో ఇరుగ్గా ఉన్న ఈ రహదారిని 12 మీటర్ల వెడల్పుకు విస్తరించారు. ప్రమాదాలు జరగకుండా కీలక ప్రాంతాలు, ప్రమాదకరమైన మలుపుల వద్ద క్రాష్ బారియర్లు, సూచిక బోర్డులు, రోడ్డు మార్కింగ్స్ ఏర్పాటు చేశారు. అలాగే రహదారికి ఇరువైపులా కాంక్రీట్ ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌లను సైతం అమర్చారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు నిర్మాణ గడువు 9 నెలలు కాగా, ప్రభుత్వం దీనిని అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. ఆగస్టు 14న ఈ రోడ్డును ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు నుంచి పీడబ్ల్యూడీకి అప్పగించారు. అనంతరం సెప్టెంబర్ 17న పరిపాలనా అనుమతులు రాగా, సెప్టెంబర్ 30 నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అక్టోబర్ 13న పనులు ప్రారంభించి, నవంబర్ 13 నాటికే నిర్మాణం పూర్తి చేశారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకే ఈ అత్యవసర పనులను చేపట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అధికారులు అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. బిటుమెన్ (తారు) కొరత, నిర్మాణ సామగ్రి రవాణాలో జాప్యం, ప్రతికూల వాతావరణం, వాహనాల రాకపోకల ఆంక్షలు ఎదురైనా పనులను నిరంతరం కొనసాగించారు. రహదారికి రెండు చివర్ల నుంచి రెండు ప్రత్యేక బృందాలు ఒకేసారి పనులను వేగవంతం చేశాయి. మధ్యలో ఏడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజల నిమిత్తం భక్తుల రద్దీ ఉన్నప్పటికీ, పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ నిర్మాణాన్ని కొనసాగించారు. తొమ్మిది నెలల పాటు సాగాల్సిన పనిని కేవలం 30 రోజుల్లోనే పూర్తి చేయడం ఒక గొప్ప విజయమని ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్ పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం, ముఖ్యమంత్రి అందించిన సహకారం వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజనాలు ముడిపడి ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంలో ఈ శబరిమల రహదారి పనులు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు. సరైన సమన్వయం, సమర్థవంతమైన కాంట్రాక్టర్ల భాగస్వామ్యం ఉంటే ఎంతటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులనైనా నిర్ణీత గడువులోగా పూర్తి చేయవచ్చని ఈ అనుభవం నిరూపించిందని ఆయన వెల్లడించారు.

ఎన్సీపీ వర్గాల విలీనానికి తెర

ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్న ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై కొనసాగుతున్న ఊహాగానాల నేపథ్యంలో ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే కీలక వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడు, దివంగత అజిత్ పవార్ జీవించి ఉన్న సమయంలోనే రెండు వర్గాల విలీనంపై చర్చలు జరిగాయని, ఆయన మరణంతో ఆ ప్రక్రియకు ముగింపు పడిందని స్పష్టం చేశారు.

విలీనంపై ఇక సంప్రదింపులు లేవు

అజిత్ పవార్ జీవించి ఉన్నప్పుడు రెండు వర్గాల మధ్య విలీనానికి సంబంధించి చర్చలు జరిగాయని సుప్రియా సూలే వెల్లడించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఒక తేదీని కూడా ఖరారు చేసినట్లు తెలిపారు. అయితే అజిత్ పవార్ మరణించిన రోజుతోనే ఆ చర్చలకు ముగింపు పడిందని పేర్కొన్నారు. ఆయన మరణం తర్వాత తమ పార్టీ ఈ అంశంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదన్నారు. అజిత్ పవార్ వర్గం నుంచి కూడా విలీనంపై తనకు ఎలాంటి ఫోన్ కాల్, సందేశం లేదా లేఖ అందలేదని సుప్రియా సూలే స్పష్టం చేశారు. ఈ విషయమై ఎవరూ తనను సంప్రదించలేదని తెలిపారు.

ఎన్డీయేలో చేరికపై ఊహాగానాలకు చెక్

ఎన్సీపీ (ఎస్పీ) బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరుతుందన్న ప్రచారాన్ని కూడా ఆమె ఖండించారు. రెండు వర్గాల విలీనంపై ప్రస్తుతానికి ఎలాంటి చర్చలు కొనసాగడం లేదన్న సంకేతాలు ఇచ్చారు.

రాజకీయాలు.. కుటుంబ బంధాలు వేరు

విలీనంపై అజిత్ పవార్ కుటుంబ సభ్యులతో చర్చలు జరిపే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. వ్యక్తిగత బంధుత్వాలను రాజకీయాలతో కలపకూడదని సుప్రియా సూలే బదులిచ్చారు. దీంతో ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై వస్తున్న ఊహాగానాలకు ఆమె వ్యాఖ్యలు మరింత స్పష్టతనిచ్చాయి.

జనగణన సమాచార సేకరణలో ఎలాంటి తప్పులకు తావుండకూడదు

- క్షేత్రస్థాయి అధికారులు విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి
- సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్



విజయవాడ, మహానగర్

జనగణన రెండవ దశ ప్రక్రియను అత్యంత కచ్చితత్వంతో, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ అధికారులకు సూచించారు. జనగణనలో సేకరించే ప్రతి సమాచారం కీలకమైనదని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ జనగణన కార్యకలాపాల ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులకు జనగణన 2027 రెండవ దశపై నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో రెండవ రోజు శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కింపు ద్వారా సేకరించే గణాంకాలు దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల సమాచార సేకరణలో ఖచ్చితత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనాభా లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, సాంకేతిక అంశాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. సమాచార సేకరణ సమయంలో ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేసుకుని, నిర్దేశిత పద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావడంలో జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వహించి, జనాభా లెక్కింపు ప్రక్రియను నిర్దిష్ట మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు, మాస్టర్ ట్రైనర్ కొల్లేటి రమేష్, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల సెన్సస్ ఇంచార్జి సి.హెచ్.వెంకటరమణ, ఇన్స్ట్రక్టర్లు వి.ఆదిలక్ష్మి, ఎం.స్వాతి, కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.వెంకట రామయ్య, జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యానికి పోషకాహార తోటలు ఎంతో దోహదం

విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలి

పర్యావరణ పరిరక్షణ, నెట్ జీరో లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ప్రభుత్వ కార్యదర్శి ముదావత్ ఎం.నాయక్



నందిగామ, మహానగర్

నేటి బాలల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పోషకాహారం ఎంతో కీలకమని, చిన్న వయస్సు నుంచే విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి ముదావత్ ఎం. నాయక్ సూచించారు. నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామ మండలం ముప్పాళ్లలోని డా.బి.ఆర్.అంబేద్కర్ బాలికలు గురుకులంలో నిర్వహించిన బాలల పోషకాహార తోటల పండుగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విత్తనాలు నాటి, మొక్కలు నాటడం ద్వారా పోషకాహార తోటను ప్రారంభించారు. విద్యార్థినులు స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు, పోషక విలువలు కలిగిన మొక్కలను పెంచడం ద్వారా తాజా, సహజమైన ఆహారాన్ని పొందవచ్చని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంచడంతో పాటు, ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నెట్ జీరో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరిస్తూ కర్బన ఉద్గారాలను తగ్గించడం, మొక్కలను విరివిగా పెంచడం, నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో పర్యావరణహిత అలవాట్లను పాటిస్తూ ఇతరులకు కూడా ఆదర్శంగా నిలవాలని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ పరిరక్షకులని, ప్రకృతి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన వాతావరణాన్ని అందించగలమని ప్రభుత్వ కార్యదర్శి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి చిన్న చిన్న చర్యలతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ఎన్.తేజ్ భరత్, అదనపు కార్యదర్శి పద్మావతి, నెట్ జీరో ఎస్.పి.డి శరవణన్, కృష్ణా జిల్లా డిసివో టి.మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన, దీపాలంకరణ





ఇంద్రకీలాద్రి, మహానగర్

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శనివారం సాయంత్రం ప్రదోష వేళ శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో సహస్ర లింగార్చనలో పాల్గొని పరమేశ్వరుడిని దర్శించుకోవడం వల్ల పాపాలు, గ్రహ దోషాలు తొలగి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల కాంతుల మధ్య జరిగిన లింగార్చన, అనంతరం నిర్వహించిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఊయల సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు, సరిత, పద్మావతి ఠాకూర్, ప్రత్యేక ఆహ్వానితుడు వి. శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా హెల్మెట్ల పంపిణీ





విజయవాడ, మహానగర్

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరప్పాడు రింగ్ సెంటర్ సమీపంలో ద్విచక్ర వాహనదారులకు ఉచిత హెల్మెట్ల పంపిణీ, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి ప్రీ-స్కూల్, కెరీర్ వాక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో కలిసి వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు కుటుంబ సభ్యుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. సమాజ హితం కోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి ప్రీ-స్కూల్, కెరీర్ వాక్ ఫౌండేషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, ఇన్స్పెక్టర్లు పవన్ కిషోర్, రమేష్, సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక అభివృద్ధికి నెహ్రూ పాలనలో బలమైన పునాది

అవనిగడ్డ, మహానగర్

స్వతంత్ర భారత తొలి ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ దేశ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేశారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి వెంకట్రామ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం పోరాడిన నెహ్రూ దేశ తొలి ప్రధానిగా భారత ప్రణాళికా సంఘ స్థాపన, మొదటి పంచవర్ష ప్రణాళికలతో ఆర్థికంగా దేశానికి పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. భూ పునఃపంపిణీ విధానం, నీటి కాలువలు త్రవ్వించడం, ఆనకట్టల నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలతో సాగు రంగాన్ని సుస్థిరం చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అనే విశ్వాసంతో పనిచేసిన నెహ్రూ రైతాంగానికి చేసిన మేలు మరువలేనిది అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుడివాక శేషుబాబు, మత్తి రాజీవ్, మాజీ ఎంపీటీసీ కటికల బాలాజీ, జనసేన పార్టీ మండల నాయకులు బచ్చు శ్రీహరి, టౌన్ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, టీడీపీ లక్ష్మీపురం అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, జనసేన కే.కొత్తపాలెం గ్రామ అధ్యక్షులు మత్తి వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), యర్రంశెట్టి సుబ్బారావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీను, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చిన్నారులకు ఆటల పోటీలు

చల్లపల్లి, మహానగర్



జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కుంభా గణేష్ కుమార్ ఆధ్వర్యంలో తొలి రోజు బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్కిప్పింగ్, లెమన్ అండ్ స్పూన్ తదితర ఆటల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

బిజినెస్

ప్యాసింజర్ వాహన విక్రయాల్లో సరికొత్త రికార్డు



పండుగ సీజన్ డిమాండ్ కలిసిరావడంతో దేశీయ ప్యాసింజర్ వాహనాల డిస్పాచ్ (డీలర్లకు సరఫరా) అక్టోబర్‌లో రికార్డు స్థాయికి చేరుకుంది. వార్షిక ప్రాతిపదికన 12.4% వృద్ధి సాధించి 5.19 లక్షల యూనిట్ల పంపిణీ జరిగిందని భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) శుక్రవారం వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో ఈ సంఖ్య 4.62 లక్షల యూనిట్లుగా ఉంది. నవంబర్ తొలి వారంలో ధనత్రయోదశి, దీపావళి పండుగలు రావడంతో ఆటో కంపెనీలు డీలర్లకు భారీగా వాహనాలను సరఫరా చేశాయి. ద్విచక్ర వాహనాల సరఫరా 22.20 లక్షల యూనిట్ల నుంచి 16.1% పెరిగి 25.78 లక్షల యూనిట్లకు చేరింది. ఇందులో స్కూటర్ల విక్రయాలు ఏకంగా 31.6% ఎగబాకి 10.97 లక్షల యూనిట్లుగా నమోదవగా, మోటార్ సైకిళ్ల విక్రయాలు 6.6% వృద్ధితో 14.23 లక్షల యూనిట్లకు చేరాయి. త్రిచక్ర వాహన విభాగం 25.7% వృద్ధితో 1.03 లక్షల యూనిట్ల విక్రయాలను నమోదు చేసింది. గతేడాది ఇదే నెలలో 82,190 యూనిట్ల డిస్పాచ్‌లు జరిగాయి. మొత్తం వాహనాలు, ఎగుమతులు: అక్టోబర్‌లో మొత్తం దేశీయ వాహన సరఫరా 15.7% వృద్ధితో 31.26 లక్షల యూనిట్లకు చేరింది. వాహన ఉత్పత్తి 28.6% పెరిగి 36.19 లక్షల యూనిట్లుగా నమోదైంది. ఎగుమతులు 26% ఎగబాకి 6.82 లక్షల యూనిట్లకు చేరాయి. మొత్తం వాహన ఎగుమతుల్లో కార్ల ఎగుమతులు 21.8% వృద్ధితో 83,716 యూనిట్లు, టూ--వీలర్ ఎగుమతులు 26.5% వృద్ధితో 5.44 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్--అక్టోబర్ మధ్య కాలంలో దేశీయ ప్యాసింజర్ వాహన సరఫరా 30.83 లక్షల యూనిట్లకు చేరుకుంది. 2025 ఇదే కాలంలో 24.56 లక్షల డిస్పాచ్‌లు జరిగాయి. ద్విచక్ర వాహనాల సరఫరా 1.25 కోట్ల యూనిట్ల నుంచి 1.47 కోట్ల యూనిట్లకు పెరిగింది. మొత్తం దేశీయ, ఎగుమతి, ఉత్పత్తి గణాంకాల్లో బీఎండబ్ల్యూ, మెర్సిడెస్, జేఎల్ఆర్, వోల్వో ఆటో వివరాలు లేవు. టాటా మోటార్స్ విక్రయాలను కేవలం మొత్తం ప్యాసింజర్ వాహనాల డేటాలో మాత్రమే కలిపారు. "అక్టోబర్‌లో ప్యాసింజర్ వాహన విభాగం అత్యుత్తమ పనితీరు కనబరించింది. నెలవారీగా విక్రయాల్లో తొలిసారిగా 5 లక్షల యూనిట్ల కీలక మైలురాయిని అధిగమించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రుణ లభ్యత మెరుగుపడటం, పాత వాహనాల మారి?పడి (రీప్లేస్‌మెంట్) డిమాండ్ ద్విచక్ర వాహన అమ్మకాలకు దన్నుగా నిలుస్తున్నాయి. చివరి మైలు రవాణా అవసరాలు, వేగవంతమైన విద్యుదీకరణ త్రిచక్ర వాహన విభాగాన్ని నడిపిస్తున్నాయి" సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు. కంపెనీల నుంచి డీలర్లకు వెళ్లే వాహనాలను 'సియామ్' లెక్కిస్తుంది. వినియోగదారులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునే రిటైల్ విక్రయాలను 'ఫాడా' ప్రకటిస్తుంది. ఫాడా నివేదిక ప్రకారం అక్టోబర్‌లో రిటైల్ విక్రయాలు 23.8% తగ్గి 31.72 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. గతేడాది నవరాత్రి, దీపావళి పండుగలు రెండూ అక్టోబర్‌లోనే రావడం, జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణ తర్వాత అప్పట్లో భారీగా కొనుగోళ్లు జరగడం వల్ల బేస్ ఎక్కువగా ఉంది. ఈ ఏడాది దీపావళి నవంబర్‌కు మారడంతో అక్టోబర్ రిటైల్ రిజి?రస్ట్రేషన్లు తగ్గినట్లు కనిపిస్తున్నా, పండుగ డిమాండ్ కోసం కంపెనీలు డీలర్లకు భారీగా డిస్పాచ్ చేయడంతో 'సియామ్' టోకు గణాంకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి.

టాటా బోర్డ్ రూంలో మరోసారి విభేదాలు

బోర్డు సమావేశాల రికార్డింగ్ విషయంలో అభ్యంతరాలు



భారతీయ కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్‌లో పాలనా వ్యవహారాలు, బోర్డు నిర్ణయాల పారదర్శకత మరోసారి చర్చనీయాంశంగా మారాయి. టాటా సన్స్ ఛైర్మన్ నోయల్ టాటా చేసిన అభ్యర్థనను సంస్థ తిరస్కరించినట్లు కథనాలొస్తున్నాయి. టాటా గ్రూప్ వంటి అంతర్జాతీయ వ్యాపార సామ్రాజ్యంలో బోర్డు సమావేశాల నిర్వహణ, కీలక నిర్ణయాల నమోదు, డైరెక్టర్ల మధ్య సమాచార మార్పిడి ఎంత ప్రాధాన్యమైనవో ఈ పరిణామం మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ వ్యవహారం కంపెనీ బోర్డు సమావేశాల్లో చర్చించే అంశాలు వ్యూహాత్మక వ్యాపార నిర్ణయాలకు సంబంధించింది కావడంతో వాటి రికార్డింగ్ విషయంలో గోప్యత కీలకంగా మారుతుంది.

ఏం జరిగిందంటే..

2026 సెప్టెంబర్ 17న జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశమే ఈ వివాదానికి మూలం. ఈ సమావేశంలో ఎన్.చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల కాలానికి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా తిరిగి నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 2017 నుంచి టాటా గ్రూప్ నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖరన్‌కు రెండో విడత పదవీకాలం కల్పించే ఈ నిర్ణయాన్ని నోయల్ టాటా వ్యతిరేకించారు. బోర్డులో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన ఏకైక డైరెక్టర్ ఆయనే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో సమావేశంలో అసలు ఏం చర్చ జరిగింది? పునర్నియామక ప్రతిపాదన ఏ విధంగా బోర్డు ముందుకు వచ్చింది? తన అభ్యంతరాలను సమావేశంలో ఎలా పరిగణించారు? వంటి అంశాలపై స్పష్టత కోసం నోయల్ టాటా పలుమార్లు సంస్థను సంప్రదించారు. సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 30, అక్టోబర్ 8, అక్టోబర్ 26 తేదీల్లో లేఖల ద్వారా సమావేశానికి సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగులను అందించాలని కోరారు. అక్టోబర్ 26న పంపిన లేఖలో పునర్నియామక నిర్ణయం తీసుకున్న విధానంపైనా ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

టాటా సన్స్ సమాధానం

నోయల్ అభ్యర్థనకు టాటా సన్స్ కంపెనీ సెక్రటరీ సుప్రకాశ్ ముఖోపాధ్యాయ నవంబర్ 9న రాతపూర్వకంగా స్పందించారు. వ్యక్తిగతంగా హాజరై నిర్వహించే బోర్డు సమావేశాల ఆడియో, వీడియో రికార్డింగులను డైరెక్టర్లకు అందించే విధానం సంస్థలో గతంలో లేదని స్పష్టం చేశారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది డైరెక్టర్లు ఆన్‌లైన్ ద్వారా సమావేశానికి హాజరైనప్పుడు వీడియో రికార్డింగ్ తప్పనిసరి అవుతుందని, ప్రత్యక్ష సమావేశాల విషయంలో అలాంటి నిబంధన లేదని సంస్థ వివరించింది. అంతేకాకుండా, సెప్టెంబర్ 17 సమావేశానికి సంబంధించిన ముసాయిదా మినిట్స్‌ను అక్టోబర్ 1న బోర్డు యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపింది. డైరెక్టర్ల సూచనలను పరిశీలించి మార్పులు చేసినట్లు పేర్కొంది. చంద్రశేఖరన్ పునర్నియామకానికి సంబంధించిన తీర్మానాన్ని కంపెనీ చట్టంలోని సెక్షన్ 117 ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు సమర్పించినట్లు కూడా వెల్లడించింది.

అసలు విభేదం ఏమిటి?

టాటా సన్స్ స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కావాలా వద్దా అన్నది ప్రధాన అంశం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఐపీఓ లిస్టింగ్ అవసరమయ్యే పరిస్థితిని చంద్రశేఖరన్ ప్రస్తావిస్తుండగా, లిస్టింగ్‌ను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోలేదన్నది నోయల్ టాటా అభిప్రాయంగా వార్తా కథనాలు వెల్లడించాయి. చంద్రశేఖరన్ నాయకత్వంలో చేపట్టిన డిజిటల్ వ్యాపారాలు, ఎయిరిండియా, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల పనితీరుపైనా నోయల్ టాటా ప్రశ్నలు లేవనెత్తినట్లు తెలుస్తోంది.

టైమ్‌కు ఫ్లాట్‌లు అప్పగించని బిల్డర్లపై రెరా కొరడా..

10.85 శాతం వడ్డీతో కట్టిన మొత్తం చెల్లించాలని ఆదేశం!



ఇళ్ల కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని నాలుగు రియల్ ఎస్టేట్ సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (టీజీ-రేరా) చర్యలు చేపట్టింది. ఇద్దరు బిల్డర్లు బాధితులకు మొత్తం రూ.60.22 లక్షలు 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించింది. మరో సంస్థకు రూ.20.05 లక్షల జరిమానా విధించింది. నాలుగో సంస్థపై జరిమానా ప్రక్రియ ప్రారంభించింది. నవంబర్ 10న జారీ చేసిన నాలుగు వేర్వేరు ఉత్తర్వుల్లో ఈ నిర్ణయాలు వెల్లడించింది. భువన్ తేజా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన హ్యాపీ హోమ్స్ ఫేజ్-2 ప్రాజెక్టులో వినుకొండ రవి 2021 అక్టోబరులో ఫ్లాట్ కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. ఫ్లాట్ ధర రూ.20.79 లక్షలుగా నిర్ణయించారు. 36 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తామని, అదనంగా ఆరు నెలల గడువు ఉంటుందని సంస్థ హామీ ఇచ్చింది. కొవిడ్ కారణంగా జాప్యం జరుగుతోందంటూ ఫేజ్-1లో మరో ఫ్లాట్ తీసుకోవాలని సంస్థ సూచించింది. ఇందుకోసం అదనంగా రూ.1.43 లక్షలు వసూలు చేసింది. మొత్తంగా రూ.22.22 లక్షలు తీసుకున్నా నిర్మాణం ప్రారంభించలేదు. ఫ్లాట్‌నూ అప్పగించలేదు. ఈ ప్రాజెక్టుకు రేరా నమోదు, అవసరమైన అనుమతులు లేవని గుర్తించిన సంస్థ.. కొనుగోలుదారుడికి మొత్తం సొమ్మును 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించింది. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వెస్ట్రన్ వేవ్స్ ప్రాజెక్టులో ముగ్గురు పెట్టుబడిదారులు రూ.38 లక్షలు చెల్లించారు. నానక్‌రామ్‌గూడలోని ఈ ప్రాజెక్టులో 500 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణం ఉన్న సెమీ ఫినిష్డ్ వాణిజ్య యూనిట్‌తో పాటు 11.5 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటాను అందిస్తామని సంస్థ ఒప్పందం చేసుకుంది. 2024 డిసెంబరులోగా స్వాధీనం చేస్తామని హామీ ఇచ్చినా ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టుకు కూడా రేరా నమోదు లేదని అధికారులు గుర్తించారు. గతంలో ఇదే సంస్థ, ప్రాజెక్టుపై వచ్చిన మరో ఫిర్యాదులో రూ.5 లక్షల జరిమానాతో పాటు డబ్బు వాపసు చేయాలని ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. తాజాగా ముగ్గురు పెట్టుబడిదారులకు రూ.38 లక్షలను 10.85 శాతం వార్షిక వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశించారు. మోదీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కీసర మండలం రాంపల్లి దాయరాలోని గోల్డెన్ కౌంటీ ప్రాజెక్టుపై విల్లాల యజమానులు, వారి సంఘం ఫిర్యాదు చేశారు. విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ పేరుతో క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్, క్రీడా సదుపాయాలు, పార్కులు కల్పిస్తామని ప్రచారం చేసినా.. 2021లోనే నివాసాలు ప్రారంభమైనప్పటికీ చాలా సదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని ఆరోపించారు. 2019 నుంచి 2023 మధ్య ఒక్కొక్కరి నుంచి క్లబ్‌హౌస్, ఇతర వసతుల కోసం రూ.5 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండీఏ అనుమతి, రేరా నమోదు ప్లాట్ల అభివృద్ధి కోసం మాత్రమే తీసుకున్నారని.. కానీ సంస్థ విల్లాల ప్రాజెక్టుగా ప్రచారం చేసిందని టీజీ-రేరా గుర్తించింది.

'యువ' గర్జన

అండర్-19 ఆసియా కప్ చాంపియన్ భారత్

ఫైనల్లో వికెట్ తేడాతో పాక్‌పై సంచలన విజయం

338 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కుర్రాళ్లు

గెలిపించిన మోహిత్, మనాల్, లక్ష్య, ఆర్యవీర్



భారత్ విజయానికి చివరి బంతికి మూడు పరుగులు కావాలి... మోహిత్ ఉల్వా కొట్టిన షాట్ లాంగాఫ్ మీదుగా బౌండరీని చేరగానే మన యువ ఆటగాళ్ల సంబరాలు షురూ అయ్యాయి. మైదానంలోకి దూసుకొచ్చిన కుర్రాళ్లంతా ఒక్కొక్కరూ తమ కసిని, ఆనందాన్ని అనుచిత సైగలతో కలగలిపి ప్రదర్శించారు...హైదరాబాద్ బౌలర్ యశ్వీర్ గౌడ్ అయితే మరికాస్త ముందుకు వెళ్లి పాక్ కీపర్ జహూర్‌పైకి దూసుకొచ్చి 'ఫేస్ టు ఫేస్' తన ఆగ్రహావేశాన్ని చూపించాడు.

ఇది కేవలం ఒక మ్యాచ్ గెలిచిన సంతోషం మాత్రమే కాదు... ఏమాత్రం అవకాశం లేని చోట అతి భారీ లక్ష్యాన్ని ఛేదించిన యువ సత్తాకు నిదర్శనం. ఎక్కడా తగ్గకుండా చివరి వరకు పట్టుదలగా నిలిచి అద్భుత ఆటతో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్న ఘట్టం... వారం రోజుల క్రితం ఇదే పాక్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ నాడు వికృతంగా సంబరాలు చేసుకున్న పాక్‌కు ఇప్పుడు అదే రీతిలో జవాబిస్తూ భారత్ ఆసియా అండర్--19 విజేతగా నిలిచింది.

భారత్ స్కోరు 252/8...గెలుపు కోసం మిగిలిన 51 బంతుల్లో 86 పరుగులు చేయాలి. ఈ దశలో మనాల్, మోహిత్ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయారు. ఈ జోడి తొమ్మిదో వికెట్‌కు 35 బంతుల్లోనే 57 పరుగులు జోడించింది. మరో భారీ షాట్ ఆడే క్రమంలో మనాల్ వెనుదిరిగాడు. సమీకరణం 16 బంతుల్లో 29 పరుగులుగా మారింది. కానీ మిగిలింది ఒకటే వికెట్!

టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న ఆంధ్ర కుర్రాడు వెంకట సుభాష్ అండగా నిలవగా... మోహిత్ బాధ్యత తీసుకున్నాడు. 19వ ఓవర్లో మోహిత్ వరుసగా 4, 6 కొట్టగా... సుభాష్ కూడా ఒక ఫోర్ కొట్టడంతో మొత్తం 17 పరుగులు వచ్చాయి. ఇక చివరి ఓవర్లో 8 పరుగులు అవసరం కాగా... తొలి 5 బంతుల్లో 5 పరుగులు వచ్చాయి. ఆఖరి బంతికి మోహిత్ ఫోర్ బాదడంతో భారత్ అసాధారణ గెలుపును అందుకుంది.

అల్ అమీరట్ (మస్కట్): ఆసియా కప్ అండర్--19 టోర్నీని భారత్ సొంతం చేసుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ వికెట్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ గెలిచిన పాకిస్తాన్ ముందుగా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖాన్ (111 బంతుల్లో 107; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... అబ్దుల్ ఖాదిర్ (54 బంతుల్లో 80; 3 ఫోర్లు, 8 సిక్స్‌లు), కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ (60 బంతుల్లో 63; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు నమోదు చేశారు.

భారత బౌలర్లలో పరేశ్ పటేల్ 4 వికెట్లు పడగొట్టగా... చిగురుపాటి వెంకట సుభాష్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 339 పరుగులు చేసి విజేతగా నిలిచింది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని (101 బంతుల్లో 80; 5 ఫోర్లు), ఆర్యవీర్ సెహ్వాగ్ (61 బంతుల్లో 58; 9 ఫోర్లు) హాఫ్ సెంచరీలు చేయగా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్ ఉల్వా (26 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మనాల్ చౌహాన్ (32 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

కీలక భాగస్వామ్యాలు...

ఉస్మాన్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా మొదలు పెట్టగా, మూడో స్థానంలో వచ్చిన ఖాదిర్ మరింత ధాటిగా చెలరేగిపోయాడు. సిక్సర్లతో చెలరేగిన ఖాదిర్ 39 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అతను వెనుదిరిగిన తర్వాత ఉస్మాన్, ఫర్హాన్ కలిసి జట్టు భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. 106 బంతుల్లో ఉస్మాన్ ఈ టోర్నీలో రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 40 ఓవర్లు ముగిసే సరికి పాక్ స్కోరు 274/3. ఆరంభంలో భారీగా పరుగులిచ్చినా... చివరి పది ఓవర్లలో ప్రత్యర్థిని నిలువరించడంలో భారత్ సఫలమైంది. ఆఖరి 10 ఓవర్లలో పాక్ 63 పరుగులు మాత్రమే చేసి 6 వికెట్లు కోల్పోయింది.

ఆర్యవీర్ జోరుగా...

భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు ఓపెనర్లు లక్ష్య, ఆర్యవీర్ మంచి పునాది వేశారు. లక్ష్య కాస్త జాగ్రత్త ప్రదర్శించగా, ఆర్యవీర్ తనదైన శైలిలో దూకుడు చూపించాడు. తొలి 10 ఓవర్లలో స్కోరు 54/0కు చేరింది. ఆ తర్వాత 51 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగానే ఆర్యవీర్ వెనుదిరిగడంతో 95 పరుగుల (106 బంతుల్లో) తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం 72 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న లక్ష్య...రెండో వికెట్‌కు వీకే వినీత్ (24)తో 51 పరుగులు జత చేశాడు.

అయితే తక్కువ వ్యవధిలో వినీత్, అర్జున్ రాజ్‌పుత్ (16), యశ్‌వర్ధన్ (9) అవుటయ్యారు. 14 ఓవర్లలో 122 పరుగులు చేయాల్సిన స్థితిలో భారత్‌కు మళ్లీ ఎదురు దెబ్బ తగలింది. నిలదొక్కుకున్న లక్ష్యను రజా పెవిలియన్ పంపించగా, దురదృష్టవశాత్తూ తర్వాతి బంతికే అన్వయ్ ద్రవిడ్ (19) రనౌటయ్యాడు. పరుగు తేడాతో ఆర్యన్ (9), పటేల్ (0) కూడా నిష్క్రమించారు. దాంతో భారత్ ఓటమికి చేరువైనట్లుగా కనిపించింది.

'వీరూ' బాటలోనే 'వీర్'

70 నాటౌట్, 22, 160, 51, 58... టోర్నీ ఐదు మ్యాచ్‌లలో ఆర్యవీర్ సెహ్వాగ్ స్కోర్లు ఇవి. భారత క్రికెట్‌లో విధ్వంసానికి మారుపేరుగా నిలిచిన తండ్రి వీరేందర్ సెహ్వాగ్ బాటలోనే కొడుకు కూడా అదే ధాటిని అండర్--19 స్థాయిలోనే చూపిస్తున్నాడు. 95.50 స్ట్రైక్‌రేట్‌తో 361 పరుగులు బాదిన ఆర్యవీర్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. లీగ్ దశలో పాక్‌తో మ్యాచ్‌లోనే విఫమైన అతను ఈ సారి అదే జట్టుపై పరుగులు సాధిస్తానని పంతం పట్టి మరీ చేసి చూపించాడు.


కెప్టెన్ లక్ష్యరాయ్ చందాని (243 పరుగులు), ఇషాన్ సూద్ (11 వికెట్లు) కూడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. టీమ్‌లో ఇద్దరు తెలుగు ఆటగాళ్లు కూడా ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ వుట్కూర్ యశ్వీర్ గౌడ్ లీగ్ దశలో 2 మ్యాచ్‌లు ఆడి 2 వికెట్లు తీయగా...ఆంధ్రప్రదేశ్ పేసర్ చిగురుపాటి వెంకట నాగ సుభాష్ ఫైనల్లో బరిలోకి దిగి 3 వికెట్లు తీశాడు. చివరి వికెట్‌గా బరిలోకి దిగి 8 బంతుల్లో 2 ఫోర్లతో అజేయంగా 11 పరుగులు చేసిన విలువ ఈ మ్యాచ్ విజయంలో అమూల్యం!

స్కోరు వివరాలు

పాకిస్తాన్ అండర్--19 ఇన్నింగ్స్: ఉస్మాన్ (సి) అర్జున్ (బి) పటేల్ 107; హాయమ్ (సి) ద్రవిడ్ (బి) పటేల్ 21; ఖాదిర్ (సి) వినీత్ (బి) అర్జున్ 80; ఫర్హాన్ (సి) ఆర్యన్ (బి) వెంకట 63; అహ్మద్ (సి) ఆర్యవీర్ (బి) వెంకట 17; జహూర్ (సి) ఉల్వ (బి) పటేల్ 10; అబ్బాస్ (సి) చౌహాన్ (బి) వెంకట 2; సయామ్ (రనౌట్) 7; షఫీఖ్ (బి) పటేల్ 11; రిజ్వానుల్లా (నాటౌట్) 4; రజా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 337. వికెట్ల పతనం: 1--62, 2--197, 3--240, 4--299, 5--305, 6--311, 7--317, 8--332, 9--336. బౌలింగ్: మోహిత్ ఉల్వా 8--0--57--0, కావ్య పటేల్ 10--0--68--4, చిగురుపాటి వెంకట 5--0--40--3, మనాల్ చౌహాన్ 3--0--40--0, ఆర్యన్ 7--0--36--0, యశ్‌వర్ధన్ 6--0--35--0, అర్జున్ 7--0--43--1, వినీత్ 4--0--14--0.

భారత్ అండర్--19 ఇన్నింగ్స్: లక్ష్య (సి) అబ్బాస్ (బి) రజా 80; ఆర్యవీర్ (సి) ఉస్మాన్ (బి) షఫీఖ్ 58; వినీత్ (సి) ఉస్మాన్ (బి) రిజ్వానుల్లా 24; అర్జున్ (సి) జహూర్ (బి) రిజ్వానుల్లా 16; యశ్‌వర్ధన్ (సి) ఉస్మాన్ (బి) అబ్బాస్ 9; అన్వయ్ (రనౌట్) 19; మనాల్ (సి) ఉస్మాన్ (బి) షఫీఖ్ 47; ఆర్యన్ (సి) హాయమ్ (బి) రిజ్వానుల్లా 9; పటేల్ (సి) జహూర్ (బి) సయామ్ 0; ఉల్వా (నాటౌట్) 49; వెంకట (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (50 ఓవర్లలో 9 వికటటట్లకు) 339. వికెట్ల పతనం: 1--95, 2--146, 3--172, 4--186, 5--217, 6--217, 7--251, 8--252, 9--309. బౌలింగ్: అలీ రజా 10--0--65--1, సయామ్ 10--0--79--1, రిజ్వానుల్లా 10--0--53--3, షఫీఖ్ 10--0--57--2, హుస్సేన్ 5--0--38--0, అబ్బాస్ 5--0--39--1.

మహానగర్



సంక్రాంతి బరిలో శర్వానంద్ జార్జ్ క్రిష్

మొదలైన డబ్బింగ్ పనులు, రిలీజ్ ఎప్పుడంటే?

టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్, విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శ్రీను వైట్ల మరోసారి తన మార్క్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొనగా.. తాజాగా చిత్ర బృందం మరో కీలక అప్‌డేట్‌ను వెల్లడించింది. 'జార్జ్ క్రిష్' సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం చిత్రీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి డబ్బింగ్ పనులు ప్రారంభమైనట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. దీంతో సినిమా నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్నాయని తెలుస్తోంది. సాధారణంగా షూటింగ్ పూర్తయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేస్తుంటారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్' డబ్బింగ్ పనులు కూడా ప్రారంభం కావడంతో సంక్రాంతి విడుదలకు చిత్ర యూనిట్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అర్థమవుతోంది. శ్రీను వైట్ల తనదైన కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో శర్వానంద్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.

'ఛావా' రికార్డు బద్దలు

కేవలం 9 రోజుల్లో రూ. 1100 కోట్ల క్లబ్‌లో 'రామాయణం'!



దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలతో దూసుకుపోతోంది. విడుదలైన కేవలం తొమ్మిది రోజుల్లోనే ఈ భారీ బడ్జెట్ చిత్రం విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' సినిమా లైఫ్‌టైమ్ ఇండియా నెట్ కలెక్షన్ల రికార్డును బద్దలు కొట్టింది. తొమ్మిదో రోజు దేశవ్యాప్తంగా రూ. 47.85 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టడంతో, భారతదేశంలో ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు రూ. 612.45 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 1,100 కోట్లను దాటాయి. ప్రస్తుతం ఈ సినిమా భారతదేశపు గ్రాస్ కలెక్షన్లు రూ. 732.20 కోట్లకు, ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్లు రూ. 378.50 కోట్లకు చేరుకున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా 'రామాయణం' మొత్తం గ్రాస్ వసూళ్లు రూ. 1,110.70 కోట్లకు చేరాయి. ఈ చిత్రం ఇంతకు ముందే షారుఖ్ ఖాన్ 'పఠాన్' (రూ. 544.28 కోట్లు), రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' (రూ. 556.36 కోట్లు) సినిమాల లైఫ్‌టైమ్ వసూళ్ల రికార్డులను కూడా వెనక్కి నెట్టింది. వాల్మీకి మహర్షి రామాయణం ఆధారంగా రెండు భాగాలుగా ఈ చలనచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సీతాదేవిని రక్షించడానికి రాముడు సాగించిన ప్రయాణమే ఈ మొదటి భాగం యొక్క ప్రధాన కథాంశం. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్ఈజి మరియు యశ్ 'మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్' సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్, లక్ష్మణుడిగా రవి దూబే నటించారు. అలాగే హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ సినిమా రెండవ భాగం 2028 దీపావళికి విడుదల కానుంది.



సేవ్ వైజాగ్.. టాలీవుడ్ హీరోయిన్ పోస్ట్ వైరల్

వైజాగ్ లేదా విశాఖపట్నం పేరు చెప్పగానే బీచ్, పచ్చని ప్రకృతి గుర్తొస్తుంది. సిటీ ఆఫ్ డెస్టినీ అని పిలుచుకునే ఈ నగరంలో ఆధునికత, పట్టణీకరణ పేరుతో కొండల్ని తవ్వుతుండటంపై తెలుగు హీరోయిన్ చాందిని చౌదరి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. తన సొంతు ఊరు అయిన వైజాగ్‌లో ప్రకృతి విధ్వంసం జరుగుతోందని రాసుకొచ్చింది. 'నా సొంతూరు వైజాగ్ పరిస్థితి చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. అభివృద్ధి, పట్టణీకరణ పేరుతో ఎటు చూసినా కొండలు, పర్వతాలను నిర్దాక్షిణ్యంగా తవ్వేస్తున్నారు' అని ఇన్ స్టా పోస్టులో చాందిని చౌదరి రాసుకొచ్చింది. ఇప్పుడు ఈ పోస్ట్ కాస్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. ఈమెకు పర్యావరణ ప్రేమికులు, వైజాగ్ ప్రజలు మద్ధతు తెలుపుతున్నారు. చాందిని చౌదరి విషయానికొస్తే.. విశాఖపట్నంకి చెందిన ఈమె షార్ట్ ఫిల్మ్‌తో కెరీర్ ప్రారంభించింది. 2015లో వచ్చిన 'కేటుగాడు' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత 'కుందనపు బొమ్మ', 'శమంతకమణి', 'హౌరా బ్రిడ్జి', 'మను' తదితర మూవీస్ చేసింది. అయితే 'కలర్ ఫోటో'.. ఈమెకు చాలా గుర్తింపు తీసుకొచ్చింది. రీసెంట్ టైంలో గామి, డాకు మహారాజ్ తదితర చిత్రాల్లో కనిపించింది.



మెగాస్టార్ చిరంజీవి ఓటీటీ ఎంట్రీకి ముహూర్తం ఫిక్స్

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దశాబ్దాలుగా తనదైన నటన, డ్యాన్స్, కామెడీ, యాక్షన్‌తో కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న ఆయన.. వెండితెరపై తిరుగులేని స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నారు. అయితే ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆ నిరీక్షణకు తెరపడనుంది. మెగాస్టార్ త్వరలోనే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం నెట్‌ఫ్లిక్స్ ఓ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'మెగావర్స్' పేరుతో ఈ టాక్ షోను రూపొందిస్తున్నారు. సాధారణ టాక్ షోలకు భిన్నంగా మెగాస్టార్ స్టైల్, ఆయన మాటతీరు, సినీ అనుభవాలు, ఆసక్తికరమైన సంభాషణలతో ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ షోకు సంబంధించి పలు ఎపిసోడ్ల షూటింగ్ కూడా పూర్తయినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఈ కార్యక్రమంలో చిరంజీవి ఎలాంటి విషయాలను పంచుకోబోతున్నారు? ఆయనతో పాటు ఎవరెవరు అతిథులుగా పాల్గొనబోతున్నారు? సినీ పరిశ్రమకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు బయటకు వస్తాయా? అనే అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా మెగాస్టార్‌ను ఒక టాక్ షో హోస్ట్‌గా చూడటం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని చెప్పొచ్చు. వాస్తవానికి 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే కొన్ని కారణాలతో ఈ కార్యక్రమం స్ట్రీమింగ్ వాయిదా పడినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. డిసెంబర్ రెండో వారాంతంలో 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను స్ట్రీమింగ్‌కు తీసుకురావాలని నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ స్ట్రీమింగ్ తేదీపై ఇప్పటివరకు నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో డిసెంబర్ రెండో వారంలోనే ఈ షో ప్రారంభమవుతుందా? లేక మరోసారి విడుదల తేదీలో మార్పులు ఉంటాయా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు వెండితెరపై తనదైన ముద్ర వేసిన చిరంజీవి.. ఇప్పుడు డిజిటల్ వేదికపై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారనేది చూడాలి. ముఖ్యంగా ఆయన అభిమానులతో పాటు ఇతర సినీ ప్రేక్షకులు కూడా ఈ టాక్ షో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబర్ రెండో వారాంతంలో మెగాస్టార్ ఓటీటీ ప్రయాణం ప్రారంభం కానుంది. దీనిపై నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

ధనుష్ 'ఓం' తెలుగు ట్రైలర్ విడుదల.. ఈ నెల 20న థియేటర్లలోకి

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఓం'. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ నటీమణులు సాయి పల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథాంశం ఈ సినిమా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక ఈ చిత్రానికి యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం. భారీ తారాగణంతో అత్యున్నత నిర్మాణ విలువలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999